www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 76 శుక్రవారం, జూలై 31, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి

తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ



**హైదరాబాద్,జూలై 30 :** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మిగతా2లో...



## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం**

**హైదరాబాద్,జూలై 30 :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన మిగతా2లో...



## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూలై 30 :** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మిగతా2లో...

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

**- లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు**



**న్యూఢిల్లీ,జూలై 30 :** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం మిగతా2లో...

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య**



**విజయవాడ,జూలై 30 :** హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని మిగతా2లో...

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 30 :** పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన మిగతా2లో...

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక



2లో

## నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి?: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ,జూలై 30 :** 2034 వరకు తెలంగాణ సీఎంగా తానే ఉంటానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిన్లాండ్, జర్మనీ టీచర్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యా యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. "నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి? పిల్లలకు అల్పాహారం అందించినందుకు రాజీనా మా చేయాలా? ఐటీఐలను కాకుండా ఏటీసీలను ఏర్పాటు చేసినందుకా? మండలాల్లో విద్యాభి వృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు ఇవ్వండి. టీచర్ల సలహాలను అధికారులు అమలు చేస్తారు. విద్యారంగంపై ఖర్చు పెట్టడానికి నాకు ఇబ్బంది లేదు." అని అన్నారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన**



**హైదరాబాద్ ,జూలై 30 :** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మిగతా2లో...

## వర్షాలతో రైతులకు ఊరట

- ఆరుతడి పంటల ప్రోత్సాహానికి చర్యలు
- రైతుల జీవనోపాధికి సంబంధించి పలు సూచనలు
- సిఎంకు సమర్పించిన నివేదికపై చిన్నారెడ్డి వివరణ




**హైదరాబాద్ ,జూలై 30 :** గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు. రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు మిగతా2లో...

## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు.ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షిం చేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్ లో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## వర్షాలతో రైతులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్పిం÷-రక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది. ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది. పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సాంకేతిక సూచనలు నిరంతరం అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. అదేవిధంగా, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు, పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది. కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదికలో అంచనా వేసింది.

## గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

### తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**హైదరాబాద్,జూలై 30 :**గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెళిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెళిశ్ విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని



ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉప యోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

(మొదటి పేజీ తరువాయి)

వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

**పుణె,జూలై 30 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు.

ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷-లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు.

# శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లపై టీఎస్ఎస్ఏ ఆందోళన

● విద్యార్థులకు మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలి
●తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్
●రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం.



**ఖమ్మం/జూలై 30/(పీపుల్స్ న్యూస్)**
ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మౌలిక సదుపాయాలు అందించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కూరేళ్ల మహేశ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం డిమాండ్ చేశారు.వర్షాకాలం నేపథ్యంలో పలు జిల్లాల్లో శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లను వారు సందర్శించి విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనేక కళాశాల హాస్టళ్లలో విద్యార్థులకు బెడ్లు లేక నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి వెంటనే బెడ్లు, రగ్గులు, బెడ్‌షీట్లు, షూస్, చెప్పులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా అన్ని హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి, భద్రతతో కూడిన వసతి కల్పించాలని, శిథిలాస్థలో ఉన్న భవనాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలు మరియు గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న వార్డెన్లు, ఉపాధ్యాయులు, కేర్‌టేకర్లు, వంటమనుషులు, అటెండర్లు తదితర అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సిబ్బంది కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఆగస్టు నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లు, గురుకులాలు, కళాశాలల్లో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర అధ్యక్షులు కూరేళ్ల మహేశ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం తెలిపారు.

# చిట్యాలలో గురుపౌర్ణమి వేడుకలు:



**చిట్యాల,జులై 29** గురు పౌర్ణమి పర్వ దినాన్ని పురస్కరించుకొని చిట్యాల పట్టణ కేంద్రంలోని ఋషి సంస్కృతి యోగ సేవ కేంద్రం/మందిరం లో శ్రీ దత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సంకల్ప క్రియ యోగ గురువు రఘు గురూజీ హాజరైనారు. గురూజీ కి యోగసాధకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గురుదేవుల చిత్ర పటాలకు పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా రఘు గురూజీ సాధకులను ఉద్దేశించి గురు సందేశం ఇచ్చారు. గురుపౌర్ణమి రోజున వేదవ్యాస మహర్షిని తప్పక కొలవాలని గురుపరంపరను కొనసాగించాలన్నారు.ప్రతి ఒక్కరు గురువుల పట్ల విశ్వాసాన్ని చూపాలని వారు చూపిన మార్గం లో పయనించాలని, గురువులను ఆరాదించాలన్నారు. ఈ కార్యక్రమం లో యోగ సాధకులు కాచం కృష్ణయ్య,కంచర్ల ఈశ్వరయ్య,బూరుగు కృష్ణయ్య, కాచం వెంకటేశ్వర్లు, పోకల దేవదాస్,కాచం రమేష్, రేగొండ వేణుమాధవ్, పందిరి అర్చన,గాదే ఎల్లేష్, జిట్ట మల్లేష్, పాల రమేష్, యోగసాధకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ఉరుమడ్లలో..ది హార్ట్ ఆఫ్ లివింగ్ ఆఫ్ టీచర్ నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను బీసీ హాస్టల్ లో విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.. పెద్దకాపర్తి లో. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పీఠం శ్రీధర్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ విద్యా కమిటీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్ గురువులను ఘనంగా సన్మానించారు..

# అపరమేధావి డా.జి దివ్యమూర్తికి గురుజ్యోతి నేషనల్ అవార్డు







**ఖమ్మం/జులై30/(పీపుల్స్ న్యూస్)**
అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి గురు జ్యోతి నేషనల్ అవార్డు లభించింది. విశాఖపట్నం కు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ వారు గుగ్గిళ్ళ దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి మరియు ఇప్పటివరకు 1500 ల మోటివేషన్ స్పీచ్ లు ఇచ్చినందుకు ఈ అవార్డును ఇస్తున్నట్లు ప్రకటన చేశారు.ఈ అవార్డును దివ్యమూర్తి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల ఎమ్మార్వో పోలె కమలాకర్ చేతుల మీదుగా గురువారం నాడు అనంతగిరి ఎమ్మార్వో కార్యాలయంలో అందుకోవడం జరిగింది. తదనంతరం దివ్యమూర్తికి ఎమ్మార్వో పోలె కమలాకర్ మరియు రెవెన్యూ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్య మూర్తి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం సన్మానం జరగడం సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 79 అవార్డులు వచ్చాయని, 143 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో శ్రీధర్, అపరమేధావి అభిమానుల సంఘం అనంతగిరి మండల అధ్యక్షులు మద్దెల నాగేంద్రబాబు, ఆర్ ఐ వెంకట నగేష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీప్రసాద్, ఎఫ్టిఎస్ గణేష్, అనంతగిరి జిపి ఓ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 6 నుండి చిట్యాల లో ఉచిత సంకల్ప క్రియ యోగ శిక్షణా తరగతులు



**చిట్యాల,జులై 30**
చిట్యాల లో ఆగస్టు 6వ తేదీ నుండి భువనగిరి రోడ్ లోని లక్ష్మీ గార్డెన్ లో సంకల్ప క్రియ యోగ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని సంకల్ప క్రియా యోగ గురువు శ్రీ రఘు గురూజీ తెలిపారు. చిట్యాల లో ఉచిత యోగ శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను బుధవారం గురూజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరం మనసు ఒక్కటయ్యేందుకు యోగ సాధన చేయాలని అన్నారు. యోగాతో పాటు ఆరోగ్యం మానసిక ప్రశాంతతకు యోగా చేయడం ఎంతో ఉత్తమమన్నారు. యోగాలో భాగంగా ధ్యానం చేసినట్లయితే మేధస్సును ఏకాగ్రతను పెంచుతుందన్నారు యోగశిక్షణలో శరీరంలో అనారోగ్య సమస్యలను దూరం చేసేలా సునాయాసమైన ఆసనాలను నేర్పిస్తామని చెప్పారు. ఆగస్టు 6వ తేది నుండి 14వ తేది వరకు జరిగే ఉచిత యోగ శిక్షణకు ప్రతి ఒక్కరు హాజరై ఆరోగ్యావంతులుగా ఉండాలని, ఆరోగ్యం మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమం లో శిక్షకులు, యోగసాధకులు కాచం కృష్ణయ్య, కంచర్ల ఈశ్వరయ్య, బూరుగు కృష్ణయ్య, పోకల దేవదాస్, కాచం వెంకటేశ్వర్లు, కాచం రమేష్, గాదె ఎల్లేష్, జిట్ట మల్లేష్, రేగొండ వేణుమాధవ్, పాల రమేష్, పాల్గొన్నారు..

# చినుకు పడితే చిత్తడే..

●చిన్న వర్షానికే బురదమయమవుతున్న రోడ్డు
●చిన్నకోడేపాక 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థుల విజ్ఞప్తి




**కొత్తపల్లిగోరి, జూలై 30 (పీపుల్స్ న్యూస్)**
కొత్తపల్లి గోరి మండలంలోని చిన్నకోడేపాక గ్రామం 9వ వార్డులో రోడ్డు దుస్థితి స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. స్వల్పంగా చినుకు పడినా రోడ్డు మొత్తం బురదమయంగా మారి, నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంటోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఈ రహదారి ద్వారా ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే చిన్నపాటి వర్షానికే రోడ్డు చిత్తడిగా మారడంతో జారి పడే ప్రమాదాలు పెరిగాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఇతర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు.వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సమస్య మరింత తీవ్రమైందని, మురుగు నీరు నిలిచిపోవడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారుతోందని వారు పేర్కొన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందువల్ల గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకుని, ఈ సమస్యను గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చిన్నకోడేపాక గ్రామం 9వ వార్డులో తక్షణమే సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు త్వరితగతిన స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

# తిలక్ నగర్ చౌరస్తాలో అక్రమ నిర్మాణాలపై చర్య



**రామగుండం,జులై 30:-**
రామగుండం ఏరియా.1 పరిధిలోని తిలక్ నగర్ చౌరస్తా పరిసర ప్రాంతంలో సింగరేణి భూమిలో జరుగుతున్న అక్రమ ప్రైవేట్ నిర్మాణాలను సింగరేణి స్పెషల్ స్క్వాడ్ బృందం పర్యవేక్షణలో కూల్చివేయడం జరిగినది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సింగరేణి భూముల్లో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు (ప్రైవేట్ నిర్మాణాలు) చేపట్టడం చట్టవిరుద్ధమని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా సింగరేణి భూమిలో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మాణాలను వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు.అధికారుల చర్యను స్థానికులు మరియు అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తూ,ప్రభుత్వ మరియు సింగరేణి భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగించాలని కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

●మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి
●జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



SCHEDULED CASTES DEVELOPMENT DEPARTMENT,
Mulugu District.
GOVT.SC.PRE-METRIC HOSTELS DAILY MENU FOR THE YEAR 2026-27

| SL NO. | DAY | MORNING 7.00AM | BREAKFAST 8.00AM | LUNCH 12.30 PM | SNACKS 5.00 PM | DINNER 7.00 PM |
|---|---|---|---|---|---|---|
| 1 | సోమవారం | రాగిజావ | కిచిడి + చారు | (M.D.M) | బిస్కెట్ | అన్నము + కూరగాయలు + సాంబార్ + అరటి పండు + కోడిగుడ్డు |
| 2 | మంగళవారం | రాగిజావ | ఉప్మా(నాటు రవ్వ)+చట్నీ | | పల్లిపట్టీ | అన్నము + పప్పు + రసము + కోడిగుడ్డు + అరటి పండు |
| 3 | బుధవారం | రాగిజావ | లెమన్ రైస్/పోపు రైస్ | | శనిగలు | అన్నము + కూరగాయలు + సాంబార్ + కోడిగుడ్డు + అరటి పండు |
| 4 | గురువారం | రాగిజావ | ఉప్మా(బొంబాయి రవ్వ)+కసము | | అటుకులు | అన్నము + చికెన్ + సాంబార్ |
| 5 | శుక్రవారం | రాగిజావ | అలుబిర్యాని | | పల్లిపట్టీ | అన్నము + కూరగాయలు + సాంబార్ + కోడిగుడ్డు + అరటి పండు |
| 6 | శనివారం | రాగిజావ | పులిహోర | | సేమియా | అన్నము + ఆకు కూర పప్పు + రసము + కోడిగుడ్డు + అరటి పండు |
| 7 | ఆదివారం | రాగిజావ | ఇడ్లీ + సాంబార్ | బగారా రైస్ + చికెన్ + సాంబార్ | బిస్కెట్ | అన్నము + కూరగాయలు + సాంబార్ |

చికెన్ : వారానికి రెండు సార్లు
కోడిగుడ్డు : వారానికి (5) సార్లు
అరటి పండు: వారానికి (5) సార్లు
స్నాక్స్: ప్రతి రోజు సాయంత్రం
నోట్: ఆదివారం మినహా సెలవు రోజులలో అన్నప్రతి పండు భోజన పసతి ఉప్పయత ఆ రోజు అరటి పండు, కోడిగుడ్డు ఉప్పడియతే ఇవ్వబడును. అన్నము + కూరగాయలు + సాంబార్ మాత్రమే ఇవ్వబడును

30/7/2026
DISTRICT COLLECTOR (SCDD)
MULUGU DISTRICT





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 30( పీపుల్స్ న్యూస్)**
వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్సీ ప్రీ–మెట్రిక్ హాస్టళ్లలో 2026--27 విద్యా సంవత్సరానికి అమలు చేయనున్న వారాంత ఆహార మెనూ పోస్టర్‌ను తన ఛాంబర్‌లో జిల్లా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతిరోజు నిర్ణయించిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఏ ఎస్ డబ్ల్యూ ఓ సురేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# అమ్మవారిని దర్శించుకుంటే తమ కుమార్తె ఇంటికి వచ్చిందన్న భావన - ఉజ్జయిని బోనాలకు ఎన్నో ప్రత్యేకతలు



**సికింద్రాబాద్ :** ఆషాఢం వచ్చిందంటే చాలు భాగ్యనగరం బోనాల శోభతో పులకించిపోతుంది. వీధి వాడా ఎటు చూసినా సందడే! ఎటు విన్నా అమ్మవారి నామ స్మరణమే! ఆగస్టు 2న ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల జాతర జరుగుతోంది. ఈ సందర్భంగా ఉజ్జయిని మహంకాళి ఆలయ విశేషాలు తెలుసుకుందాం.పుట్టింటికి అమ్మవారు : ఆషాఢంలో తెలంగాణాలో జరిగే అతిపెద్ద జాతర బోనాలు పండుగ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బోనాల పండుగ. ఆషాఢమాసంలో కొత్తగా వివాహమైన అమ్మాయిలు పుట్టింటికి వెళ్లడం మన సంప్రదాయం. అలాగే నిత్య పెళ్లి కుమార్తె అయిన అమ్మవారు ప్రతి ఆషాఢంలో తన పుట్టింటికి వెళ్తుందని భక్తుల నమ్మకం. అందుకే భక్తులు ఈ పండుగ టైంలో అమ్మవారిని దర్శించుకుని తమ సొంత కుమార్తె తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తి శ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో బోనాల పేరిట ఆహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు.200 ఏళ్ల నాటి ఆలయం : ఆగస్టు 2, ఆదివారం సికింద్రాబాద్?లో వెలసిన శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాలు జాతర జరగనుంది. ఈ ఆలయం దాదాపు 200 సంవత్సరాల క్రితం నాటిదని స్థానికుల నమ్మకం. ఈ గుడిలో శక్తికి, అధికారానికి దేవత అయిన మహంకాళి మాత కొలువై ఉంటారు.

లక్షల్లో రానున్న భక్తులు : నిత్యం రద్దీగా ఉండే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని ప్రతి రోజు వందల సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఇక బోనాల పండుగ రెండు రోజులు ఇక్కడకు వచ్చే భక్తుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. లష్కర్ బోనాలుగా పిలవబడే ఈ సికింద్రాబాద్ జాతరను చూడటానికి తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర దేశాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

ఆలయ విశేషాలు – స్థల పురాణం : ఉజ్జయిని మహాంకాళి దేవాలయం 1815లో నిర్మితమైనది. సికింద్రాబాద్ పాత బోయిగూడ నివాసి అయిన సురటి అప్పయ్య బ్రిటిష్ ఆర్మీలో ఉద్యోగం చేసేవారు. 1813 సంవత్సరంలో ఉద్యోగ రీత్యా ఆయనను మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి బదిలీ చేశారు. బదిలీ జరిగిన కొద్ది రోజులకే ఉజ్జయిని ప్రాంతంలో కలరా వ్యాధి సోకి వేలాది మంది మృతి చెందారు.అప్పయ్య మొక్కులు : ఆ సమయంలో మిలిటరీ జాబ్? చేస్తున్న అప్పయ్య సహోద్యోగులతో కలిసి ఉజ్జయినిలోని మహంకాళి అమ్మవారిని దర్శనం చేసుకొని ఉజ్జయినిలో కలరా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించి, పరిస్థితులు చక్కబడితే తన స్వస్థలమైన సికింద్రాబాద్ (లష్కర్)లో ఉజ్జయిని అమ్మవారికి గుడి కట్టి కొలుస్తామనీ మొక్కుకున్నారంట.

రి కరుణ వల్లనే ఇదంతా జరిగింది : తన బిడ్డలను ఎల్లప్పుడూ రక్షించే ఆ అమ్మవారు కరుణ వల్ల కొద్ది రోజులకు కలరా వ్యాధికి గురైన వారు కోలుకున్నారు. కలరా వ్యాధి కూడా తగ్గుముఖం పట్టింది. అంతట అమ్మవారి కరుణ వల్లనే ఇదంతా జరిగిందని విశ్వసించిన సురటి అప్పయ్య, ఆయన మిత్రులు 1815లో ఉజ్జయిని నుంచి సికింద్రాబాద్‌కు వచ్చి, ఉజ్జయినిలో జరిగిన కలరా వ్యాధి సమయంలో తన మొక్కుబడి గురించి కుటుంబ సభ్యులకు ఆయన వివరించారు.

మహంకాళికి తాత్కాలిక ఆలయం : కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారితో కలిసి పాత బోయిగూడ బస్తీకి దూరంగా ఉన్న ఖాళీ స్థలంలో (ప్రస్తుతం గుడి ఉన్న ప్రాంతంలో) కట్టెలతో తయారు చేసిన మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఉజ్జయిని మహంకాళిగా నామకరణం చేసి పూజలు మొదలుపెట్టారు.బావిలో మాణిక్యాల అమ్మవారి విగ్రహం : ఆలయ నిర్మాణం జరుగుతున్న సమయంలో జాతరకు తరలివచ్చే భక్తులకు నీటి సౌకర్యం కోసం పక్కనే ఉన్న పాడుబడిన బావిని పునరుద్ధరిస్తున్న సమయంలో మాణిక్యాల అమ్మవారి ప్రతిమ లభించింది. ఆ ప్రతిమను మహంకాళి అమ్మవారి విగ్రహం పక్కనే ప్రతిష్ఠించి మాణిక్యాల అమ్మవారిగా నామకరణం చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆలయం దినదిన ప్రవర్ధమానమవుతూ భాగ్యనగరానికి తలమానికంగా నిలిచింది.పండుగ వాతావరణం : బోనాలు జరిగే రెండు రోజులు ఆలయ పరిసరాలన్నీ సుందరంగా తీర్చి దిద్దుతారు. పండుగ సందర్భంగా మామిడి, వేపాకులతో అలంకరించబడిన వీధులు దర్శనమిస్తాయి. జానపద శైలిలో ఉండే అమ్మవారి కీర్తనల హోరుతో, భక్త జనసంద్రంతో పండుగ వాతావరణం కళతో సికింద్రాబాద్ ప్రాంతం అంతా కోలాహలంగా ఉంటుంది.రంగం – భవిష్యవాణి : అమ్మవారు స్వరూపంగా భావించే మహిళ చెప్పే భవిష్యవాణి ఈ 2 రోజుల జాతరలో కీలకం. భవిష్యవాణిలో ఈ సంవత్సరం వర్షాలు ఎలా కురుస్తాయో, ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటే ఏమి చెయ్యాలో ఇవన్నీ చెబుతారు. ఇందుకోసం ఎంతో మంది ఆసక్తిగా ఎదురు చూస్తారు.బోనాల జాతరలో అమ్మవారిని దర్శించుకొని మొక్కుకుంటే తీరని కోరిక ఉండదు. ఈ సంవత్సరం కోరుకొని, అనుకున్న పనులు పూర్తి అయ్యాక వచ్చే సంవత్సరం మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఊరు ఊరంతా ఒక చోట చేరి భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఈ బోనాల పండుగ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'సింగరేణి ఆస్తుల సంరక్షణలో శాలెం రాజు సేవలు చిరస్మరణీయం



**రుద్రంపూర్, జూలై 30 :** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌గా విశిష్ట సేవలందించి శుక్రవారం పదవీ విరమణ పొందనున్న ఎం.శాలెం రాజును ఏరియా ఎస్అండ్‌పీసీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు గురువారం ఏరియా ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఏరియా సెక్యూరిటీ అధికారి అభిలాష్ మాట్లాడుతూ.. సింగరేణిలో ఎక్కడా లేని విధంగా కొత్తగూడెం ఏరియా ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో ఫీడర్ క్యాంటీన్ ఏర్పాటు కావడం శాలెం రాజు చొరవతోనే సాధ్యమైందని తెలిపారు. అలాగే ఏరియాలోని వివిధ చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అవసరమైన ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి పరిష్కరించేవారని, సిబ్బంది మనోధైర్యాన్ని పెంపొందించేలా ఎల్లప్పుడూ అండగా నిలిచారని అన్నారు. చాతకొండ ప్రాంతంలో సుమారు 40 ఎకరాల సింగరేణి భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుని తిరిగి సంస్థ స్వాధీనంలోకి తీసుకురావడంలో శాలెం రాజు చూపిన చొరవ, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని కొనియాడారు.అంతేకాకుండా సింగరేణి భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు, ఉత్పత్తి, ఉత్పాదకతకు ఎలాంటి ఆటంకం కలగకుండా వివిధ విభాగాల అధికారులతో సమన్వయం చేస్తూ కొత్తగూడెం ఏరియాను ముందంజలో నిలిపారని అభిలాష్ పేర్కొన్నారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టిన ఆయన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలోఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ ,ఐ ఎన్ టి యు సి ఏరియా ప్రెసిడెంట్ రజాక్ , ఏఐటిసి అసిస్టెంట్ ప్రెసిడెంట్ ఎస్ ఓ టు జి ఎం ఎం. గోవిందరావు,జూనియర్ ఇన్స్పెక్టర్ కామరాజు ఫిట్ సెక్రటరీలు మోహన్ రెడ్డి, మల్లికార్జున్, ఫంక్షన్ కమిటీ ఆర్గనైజర్ హానోకు రాజు షిఫ్ట్ జమేధర్స్ విక్టర్, కమల్ సింగ్, సీనియర్ సెక్యూరిటీ గార్డ్స్ జనార్ధన్ ,గౌస్ సుధాకర్ ,సంపత్ ,విజయ్, కుమార్ ,డేవిడ్ ,వెంకట్ , ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్స్ నూకరాజు ,దినేష్ ,యాదవ్ ఈశ్వర్ , ఏరియా ఎస్అండ్‌పీసీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, పాల్గొని శాలెం రాజుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వాల్మీకి నగర్ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**-- స్థానికుల విజ్ఞప్తితో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

**-- అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఎమ్మెల్యే**



**బాలానగర్ జులై 31 ( పీపుల్స్ న్యూస్)**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వాల్మీకి నగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా సమయంలో తగినంత నీటి ఒత్తిడి (ప్రెషర్) లేకపోవడంతో చాలా మంది నివాసితులు నిత్యావసరాలకు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఈ సమస్యను ఎన్నోసార్లు సంబంధిత వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో, స్థానిక మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌ను కలిసి తమ గోడును వినిపించారు. ప్రజల సమస్యను వెంటనే స్వీకరించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, వాల్మీకి నగర్ కాలనీ ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి తాగునీటి సమస్యను సమగ్రంగా వివరించారు. కాలనీలో తక్కువ ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతుండటంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల సమస్యను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెంటనే స్పందించి, సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాల్మీకి నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను అత్యవసరంగా పరిశీలించి, తగిన సాంకేతిక చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం కల్పించేలా అవసరమైన పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరాను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. వాల్మీకి నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు నిరంతరం అధికారులతో సమన్వయం చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా ముందుంటానని పేర్కొన్నారు. వాల్మీకి నగర్ వాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తక్షణ స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను సానుకూలంగా స్వీకరించి అధికారులకు వెంటనే ఆదేశాలు ఇవ్వడం పట్ల ఎమ్మెల్యేకు, అలాగే తమ తరఫున సమస్యను ముందుకు తీసుకెళ్లిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నగర్ అసోసియేషన్ సభ్యులు రాము గౌడ్, అశోక్ చారి, అమిత్ పటేల్, శ్రీహరి చారి, ఫతేనగర్ కోఆర్డినేటర్ బోగాది సురేందర్ నాయుడుతో పాటు కాలనీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, నివాసితులు పాల్గొని తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

# తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎస్సార్.



**రేగొండ,జులై 30(పీపుల్స్ న్యూస్)**
భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం రామన్నగూడెం తండా గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహిస్తున్న తీజ్ పండుగ వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, లంబాడా సంస్కృతి, సంప్రదాయాలు తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయని అన్నారు. మహిళలు



భక్తిశ్రద్ధలతో జరుపుకునే తీజ్ పండుగ ఆనందోత్సాహాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం లంబాడా సోదరమణులతో కలిసి నృత్యం చేశారు.అనంతరం గ్రామ సర్పంచ్ బానోతు రవళిక వీరు నాయక్ దంపతులు, పెద్దలు,మహిళలు ఎమ్మెల్యే గండ్ర ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గూటోజు కిష్టయ్య పిఎసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఎస్ ఐ హేమ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి,పట్టెం శంకర్, సర్పంచ్ రవళిక వీరు నాయక్,మాజీ సర్పంచ్ జంగిటి సుధాకర్, బానోతు రాజేందర్, బానోతు రవీందర్, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు, లంబాడా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భూపతిపూర్ గ్రామంలో ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన

**- ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 30 (పీపుల్స్ న్యూస్)**
కన్నాయిగూడెం మండలంలోని భూపతిపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి గురు



వారం పరిశీలించారు.చిట్యాల గ్రామం నుంచి భూపతిపూర్ గ్రామానికి పోలింగ్ కేంద్రాన్ని మార్పు చేసే ప్రతిపాదన సందర్భంగా పోలింగ్ స్టేషన్ పరిస్థితులను పరిశీలించి, పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, మరుగుదొడ్లు, భవనం పరిస్థితి తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. భూపతిపూర్ గ్రామ ప్రజలతో మాట్లాడి, పోలింగ్ కేంద్రాన్ని చిట్యాల




గ్రామం నుంచి భూపతిపూర్‌కు మార్చడంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఓటర్లకు సౌకర్యవంతమైన వాతావంణంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కిషోర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి

**అడిషనల్ డిసిపి సి. వేణుగోపాల్ రెడ్డి**

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్) :** ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అడిషనల్ డిసిపి సి. వేణుగోపాల్ రెడ్డి సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా ప్రచారంలో భాగంగా హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వద్ద వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. వృత్తిపరమైన డ్రైవర్లలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ మళ్లింపులు , సురక్షితమైన డ్రైవింగ్ విధానాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి సి. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల సురక్షిత




రవాణాలో, నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమైనదని నొక్కి చెప్పారు. ప్రతి డ్రైవర్ "అరైవ్ అలైవ్" స్ఫూర్తిని పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రయాణికుల భద్రతకు సహకరించాలని అధికారులు కోరారు.ఈ




కార్యక్రమానికి ట్రాఫిక్–×× అడిషనల్ డిసిపి సి. వేణుగోపాల్ రెడ్డి, గోషామహల్ ట్రాఫిక్ పిఎస్ అడిషనల్ ఇన్స్పెక్టర్ కె.ఎన్. ప్రసాద్ వర్మ హాజరయ్యారు.

# అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మంత్రి సీతక్క

- గత ఏడాది కాలంలోనే 5,938 కేంద్రాలకు టాయిలెట్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం
- రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వంద శాతం మౌలిక వసతులు కల్పించాలి
- ఏ మాత్రం జాప్యం లేకుండా అన్ని జిల్లాల్లో అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి
- అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 30( పీపుల్స్ న్యూస్)**

హైదరాబాద్: అంగన్వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, చిన్నారుల పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, దత్తత కేంద్రాలు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందన్న వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు.

చిన్నారుల ఉదయం ఆకలిని తీర్చడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడేలా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యమైన ఆహారం అందడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలను స్వీకరించి వాటి ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 16 జిల్లాల్లో నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.టీచర్లు, ఆయాల యూనిఫాంలను అక్టోబర్ తొలి వారంలోగా సిద్ధం చేయాలని, అంగన్వాడీ టీచర్లకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. కేంద్రాలకు ముదురు రంగులు కాకుండా పిల్లలకు ఉత్సాహాన్ని కలిగించే ఆహ్లాదకరమైన రంగులు వేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్యం, పోషణకు అనువైన వాతావరణంగా మారాలని చెప్పారు.వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా అంగన్వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా మార్చాల్సిన పరిస్థితి వస్తే, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన అన్ని జిల్లాలు, ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసి బాలింతలకు సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు.ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు. పిల్లల సంరక్షణ, దత్తత ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.

తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల నివారణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**నిధులు లాప్స్ కాకుండా పూర్తిగా వినియోగించాలి**

కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయి సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా ఇద్దరు, ముగ్గురు అధికారులను నియమించి సమన్వయ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారుల మధ్య సమన్వయం కోసం కూడా ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, రోజువారీ, వారపు నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని మంత్రి సూచించారు. ఎన్ని కేంద్రాలు, హాస్టళ్లను సందర్శించారు, అక్కడ గుర్తించిన సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటన్న వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

# వృద్ధులు, దివ్యాంగులకు చేరువలో పోలింగ్ కేంద్రాలు

- ఓటర్లకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం
- ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి







**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 30 (పీపుల్స్ న్యూస్)**

వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ములుగు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి తెలిపారు. గురువారం వెంకటాపూర్ మండల పరిధిలోని నూతన పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో కృష్ణవేణి పరిశీలించారు.ఈ సందర్భంగా సుబ్బక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ నెం. 5/ఏకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించారు.ప్రస్తుతం ఉన్నా పోలింగ్ స్టేషన్ నెం. 4లో ఉన్న 1,391 మంది ఓటర్లలో 50 మందిని, పోలింగ్ స్టేషన్ నెం. 5లో ఉన్న 1,345 మంది ఓటర్లలో 400 మందిని విభజించి సుమారు 450 నుంచి 500 మంది ఓటర్లతో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలు నాలుగు కిలోమీటర్లకు పైగా దూరంలో




ఉండటంతో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన అధికారులు, వారి సౌకర్యార్థం కొత్త కేంద్రాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు.అనంతరం పేర్కపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ నెం. 3/ఏ ను ఈఆర్వో సందర్శించారు.ఈ కేంద్రం పరిధిలో బావ్‌సింగ్‌పల్లి గ్రామానికి చెందిన 277 మంది, లక్ష్మీపురం గ్రామానికి చెందిన 150 మంది, పేర్కపల్లి గ్రామానికి చెందిన 300 మంది కలిపి మొత్తం 727 మంది ఓటర్లు ఉండనున్నారు.ఇప్పటి వరకు 1,221 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం నుంచి వీరిని విభజించినట్లు తెలిపారు.సుబ్బక్కపల్లి, పేర్కపల్లి గ్రామ పంచాయతీల గ్రామసభలు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానాలు ఆమోదించినట్లు వెల్లడించారు. రానున్న 109-ములుగు శాసనసభ నియోజకవర్గం, 16-మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రతి ఓటరికి చేరువలో ఓటింగ్ సౌకర్యం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గిరిబాబు, ఎన్నికల డిటి నితీష్ కుమార్, బి ఎల్ వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వడియారం గ్రామంలో వర్షాల ముందస్తు చర్యలు



**చేగుంట జూలై 30**

చేగుంట మండలం వడియారం గ్రామంలో భారీ వర్షాల నేపథ్యంలో పూరి గుడిసెలు కూలిపోయే స్థితిలో ఉన్న పెంకుటిళ్లలో నివసిస్తున్న ప్రజలను సర్పంచ్ అంకన్నగారి సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు.ప్రజల భద్రత దృష్ట్యా ఎమర్జెన్సీ నివాసం కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల లో గదులను ఏర్పాటు చేశారు.ఎవరికైనా ఎమర్జెన్సీ ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో 88 మంది అనాధలకు అన్న ప్రసాదన్న వితరణ



**చేగుంట జూలై 30**

లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శివంపేట మండలం మగ్ధంపూర్ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమంలోని 88 మంది అనాధలకు అన్న ప్రసాద వితరణ పండ్లుఅందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు మాట్లాడుతూ "సేవే పరమ ధర్మం. మనిషి జీవితానికి




నిజమైన అర్థం అతను సంపాదించిన సంపదలో కాదు, సమాజానికి అందించిన సేవల్లో ఉంది. పదవులు, బాధ్యతలు గౌరవాలు పొందడమే కాకుండా వాటిని ప్రజాసేవకు ఉపయోగించిన వారే సమాజంలో స్థిరంగా నిలిచిపోతారు" అని అన్నారు. లయన్ ఘట్టమనేని బాబురావు అలాంటి సేవా తపన కలిగిన వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమం




**చేగుంట జూలై 30**

లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు శివంపేట మండలం మగ్దంపూర్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు.బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమం, మగ్దంపూర్ లో పర్యావరణ పరిరక్షణకొరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల సంచారం -- భయంలో గ్రామీణులు

**? ప్రతిరోజూ వీధిలో కుక్కల కాపలా... చిన్న పిల్లలు, మహిళలకు తప్పని తిప్పలు**



**?చేగుంట జులై 30**

చేగుంట మండల కేంద్రంలోని సన్నటి గల్లీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఆ దారి పొడవునా గుంపులుగా చేరి తీక్షణంగా చూస్తున్న కుక్కలను దాటుకొని వెళ్లాలంటే బాటసారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రతిరోజూ ఈ ఇరుకు మార్గం నుంచే పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, ఒంటరిగా నడిచే మహిళలు మరియు వృద్ధులు ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వణికిపోతున్నారు. వేరే ప్రాంతాల్లో వీధి కుక్కల దాడిలో చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దారిలోనే కోతులు కూడా కాపు కాచి కూర్చుంటుండటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలు, కోతుల ముప్పు నుండి ఊరట కలిగించాలని, ఏదైనా జరగరాని ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పరిస్థితి తీవ్రంగా ఉన్నందున చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# 200కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం.

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- రఘునాథపాలెం లోని స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నెలరోజుల లోపు అందుబాటులోకి రావాలి
- విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన
- ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం/జూలై/30(పీపుల్స్ న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇం ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీసీపీ మల్కాజిగిరి సీహెచ్ . శ్రీధర్











**మల్కాజిగిరి కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్):** బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ మల్కాజిగిరి సీహెచ్ . శ్రీధర్ వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని విభాగాల పనితీరు, నిర్వహణ, ప్రజా సేవల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించే దిశగా అధికారులు, సిబ్బందికి ఉత్తమ పోలీసింగ్ విధానాలపై విలువైన సూచనలు, మార్గనిర్దేశం చేశారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించడం పరిశుభ్రమైన పర్యావరణ పరిరక్షణ పట్ల పోలీసు శాఖ యొక్క నిబద్ధతను చాటిచెప్పారు.

# నాలుగు నిమిషాల్లో చేరుకుని.. నాలుగు ప్రాణాలను కాపాడిన పోలీసులు



**మల్కాజిగిరి కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్):** డయల్-100కు అందిన సమాచారంపై చైతన్యపురి పెట్రోల్ మొబైల్-× సిబ్బంది డబ్ల్యూపీసీ ఎం. చంద్రకళ, కానిస్టేబుల్ జె. బాలరాజు కేవలం 4 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుని హైడ్రా బృందంతో కలిసి మూసీ నదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్న మహిళతో పాటు ఆమె ముగ్గురు పిల్లలను సురక్షితంగా రక్షించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో స్పందించిన చైతన్యపురి పోలీసులను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి అభినందించారు.

# పెట్లబురుజులోని సీటీసీ లో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం





**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్):** పెట్లబురుజులోని సీటీసీ లో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నగర కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సెల్‌ఫోన్ చోరీ కేసుల్లో నమోదైన నేరస్థులకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం హైదరాబాద్ నగర క్రైమ్స్ ఌ ఎస్ఐటీ అదనపు పోలీస్ కమిషనర్ ఎమ్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, జూబ్లీహిల్స్ జోన్ డిసిపి ఎ. రమణారెడ్డి, చార్మినార్ జోన్ డిసిపి ఖేరే కిరణ్ ప్రభాకర్, టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి అందె శ్రీనివాస్, ఇతర జోనల్ అదనపు డిసిపిలు, నగర వ్యాప్తంగా ఉన్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. నగరంలోని ఏడు జోన్ల పరిధికి చెందిన మొత్తం 288 మంది సెల్‌ఫోన్ నేరస్థులు ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేరస్థులు ఇకపై ఎలాంటి ఫోన్ చోరీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడకూడదని అధికారులు స్పష్టం చేశారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గాలు ఎంచుకోకుండా, చట్టానికి కట్టుబడి జీవించాలని, సొంతంగా నైపుణ్యాలు పెంపొందించుకుని గౌరవప్రదమైన మార్గాల్లో జీవనోపాధి పొందాలని హితవు చెప్పారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాల్సిన ఆవశ్యకతను వివరించారు. నేరాలకు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన తీవ్ర పరిణామాలను అధికారుల బృందం నేరస్థులకు స్పష్టంగా వివరించింది. అలవాటుపడిన నేరస్థులపై హైదరాబాద్ సిటీ పోలీస్ చట్ట ప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. అదే సమయంలో నిజాయితీగా మారాలనుకునే వారికి కౌన్సెలింగ్, పునరావాసం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా సమాజంలో తిరిగి సాధారణ జీవితం గడిపేందుకు పూర్తి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి అదనపు సీపీ ఎమ్. శ్రీనివాస్ మాట్లాడుతూ నేరాలను అరికట్టడంతో పాటు నేరస్థులలో పరివర్తన తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పదే పదే నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, మార్పు వైపు అడుగులు వేసే వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. నేర మార్గాన్ని శాశ్వతంగా వీడి, చట్టబద్ధమైన జీవన విధానాన్ని ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. కఠినమైన చట్ట అమలు, ముందస్తు నివారణ చర్యలు, కౌన్సెలింగ్ , పునరావాస కార్యక్రమాల సమన్వయంతో నగరంలో ఆస్తి నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేసి, ప్రజల ఆస్తులకు తగిన భద్రత కల్పిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మహిళా భద్రతా విభాగం డీసీపీ.










**మల్కాజిగిరి కమిషనరేట్, జూలై30 (పీపుల్స్ న్యూస్) :** విధుల సమర్థవంతమైన నిర్వహణతో పాటు ప్రజలకు వేగవంతమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించాలని మహిళా భద్రతా విభాగం డీసీపీ టి. ఉషారాణి అన్నారు. గురువారం సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆమె పాల్గొని వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల నిర్వహణ, వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి సమస్యలు, విధి నిర్వహణకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమం, విధుల సమర్థవంతమైన నిర్వహణతో పాటు ప్రజలకు వేగవంతమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించేలా అవసరమైన సూచనలు, మార్గనిర్దేశం చేశారు.

# కుటుంబ ఆస్తి తగవుల నేపథ్యంలో హత్యాయత్నం కేసు

## ముగ్గురు నిందితులను అరెస్ట్



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్) :** హైదరాబాద్ డైబాగ్ ప్రాంతంలో కుటుంబ ఆస్తి తగవుల కారణంగా జరిగిన దారుణ హత్యాయత్నం కేసులో ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను టప్పాచబుత్ర పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం..... ఆసిఫ్‌నగర్ కు చెందిన మహమ్మద్ దస్తగిరి షరీఫ్ (32) కు నిందితుడైన తన వదిన షమీమ్ బేగం అలియాస్ షమీమ్ సుల్తానాతో కుటుంబ ఆస్తి తగవులు , గృహ సంబంధిత విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆమెను హతమార్చాలని పథకం పన్నిన మహమ్మద్ దస్తగిరి షరీఫ్, తన సహచరులైన ఎండీ గులామ్ నబీ ఖురేషి (44) మహమ్మద్ ఉస్మాన్ అలియాస్ అడ్డు అలియాస్ అడ్డు బా (25) సహాయం కోరగా వారు అందుకు అంగీకరించారు. ఈ నెల 27న మహమ్మద్ దస్తగిరి షరీఫ్ తన సహచరులు ఎండీ గులామ్ నబీ ఖురేషి మహమ్మద్ ఉస్మాన్ అలియాస్ అడ్డు అలియాస్ అడ్డు బాలతో కలిసి హోండా ఆక్టివా స్కూటర్ (టీజీ12 బీ 0120) పై డైబాగ్ సమీపంలోని సమోసా గల్లీలో ఉన్న బాధితురాలి ఇంటికి చేరుకున్నారు. ఎండీ గులామ్ నబీ ఖురేషి తన వద్ద ఉన్న కసాయి కత్తిని తీసుకెళ్లాడు. అయితే మహమ్మద్ దస్తగిరి షరీఫ్ , ఎండీ గులామ్ నబీ ఖురేషి లు అక్రమంగా ఇంట్లోకి చొరబడి ఎండీ గులామ్ నబీ ఖురేషి కసాయి కత్తితో బాధితురాలి మెడపై దాడి చేశాడు బాధితురాలి భర్త మహమ్మద్ అజం షరీఫ్ అడ్డుకోగా, నిందితులు అతడిని నిర్బంధించి దాడి చేశారు. తీవ్ర గాయాలైన బాధితురాలు ప్రాణభయంతో పక్క భవనంలోకి పరుగెత్తగా, నిందితులు ఆమెను వెంటాడి, గేటు పగులగొట్టి, మెట్లపై నుండి లాగి మహమ్మద్ దస్తగిరి షరీఫ్ మళ్లీ కత్తితో ఆమె కడుపులో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు స్థానికులు పెద్ద ఎత్తున గుమిగూడటంతో నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. సమాచారం అందుకున్న టప్పాచబుత్ర పోలీసులు కేసు నమోదు చేసుకున్న టప్పాచబుత్ర పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి, గురువారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ దస్తగిరి షరీఫ్ అలియాస్ పప్పు ఇచ్చిన సమాచారం మేరకు దాడికి ఉపయోగించిన కత్తి, వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.కుల్సుంపుర డివిజన్ ఏసీపీ వి. తిరుపతి పర్యవేక్షణలో, టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ జి. బాలకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎల్. రాజు (ఐఓ) సిబ్బంది యు. గణేష్, ఎస్. మోహన్ రావు, పి. సతీష్, జి. వెంకటేష్, వి. రామాంజనేయులు, జి. నిరంజన్, పి. శివకుమార్ చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసి బాధితురాలికి న్యాయం చేకూర్చారు. సమయానుకూలంగా స్పందించి కేసును త్వరితగతిన ఛేదించిన ఏసీపీ కుల్సుంపుర డివిజన్, టప్పాచబుత్ర పోలీస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా కుసుమ రజిత

- బీసీ విభాగంలో రాజపేట వాసికి దక్కిన అవకాశం....



**రాజాపేట, జూలై 30**
రాజాపేట కు చెందిన కుసుమ రజిత తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షురాలుగా నియామకం జరిగింది. రాష్ట్ర టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియామక పత్రాన్ని కుసుమ రజితకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ అభివృద్ధికి బీసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు, కల్వకుంట్ల కవితకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. రాజపేట మహిళకు దక్కిన అవకాశం పట్ల పలువురు కుసుమ రజితను అభినందించారు.

# గోదావరి ఘాట్ ను పరిశీలించిన ఏసీపీ రమేష్,సిఐ ఇంద్రసేనారెడ్డి



**రామగుండం,జులై 30**
గోదావరిఖని-1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరి నది తీరాన ఉన్న సమ్మక్క ఆలయం సమీపంలోని గోదావరి ఘాట్ ప్రాంతాన్ని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్,వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నదిలోకి నీటిని విడుదల చేసే నేపథ్యంలో పరిస్థితులను పరిశీలించారు.
గోదావరిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున సమీప గ్రామాల ప్రజలు, మత్స్యకారులు,నది పరిసర ప్రాంతాల్లో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.నది వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

-- నలుగురు అరెస్ట్, ఒకరు పరారీ



**రాజాపేట జూలై 30**
రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దూదివెంకటాపురం గ్రామ శివారులో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు 29న బుధవారం రాత్రి రాజపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై లింగారెడ్డి ఆదేశాలతో ఏఎస్ఐ జి. ప్రభాకర్ నాయుడు, ఇద్దరు మధ్యవర్తులను వెంట తీసుకొని పోలీసు సిబ్బందితో కలిసి గ్రామ శివారులో దాడి చేపట్టారు.దాడి సమయంలో కొంతమంది వ్యక్తులు నగదు పందేలతో పేకాట ఆడుతుండగా గుర్తించారు. పోలీసులు అక్కడున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పోలీసులను గమనించి అక్కడి నుంచి పరారయ్యాడు.నిందితుల వద్ద నుంచి రెండు పేకముక్కల సెట్లు, రూ.3,800 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు (గ్లామర్, స్ప్లెండర్), ఒక నాలుగు చక్రాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులతో కలిసి రాజపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను పూర్తిగా నివారించాలి

- నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్
- విగ్రహ తయారీదారులతో నగర సీపీ సజ్జనర్ సమన్వయ సమీక్షా సమావేశం








**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్) :**
రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం ముందస్తు సన్నద్ధతను వేగవంతం చేసింది. ఇప్పటికే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో భేటీ అయిన ఉన్నతాధికారులు.. తాజాగా విగ్రహ తయారీదారులతో సమన్వయ సమీక్ష నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. గత ఏడాది నగర కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల విగ్రహాలను ప్రతిష్టించారని, అయితే రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేసిన ఆయన, ఈసారి అటువంటి పొరపాట్లకు తావులేకుండా తయారీ దశ నుంచే పక్కా భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో చర్చించిన మేరకు విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులకే పరిమితం చేయాలన్నారు. కళాకారులు సామాజిక బాధ్యతతో మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనమయ్యే చిన్న విగ్రహాల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విగ్రహాల తయారీ వర్క్‌షాప్‌లలో ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ చర్యలు చేపడుతూ, విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండేలా చూసుకోవాలని, ఆవరణలను ప్రమాదకర రసాయనాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తయారీదారులకు అవసరమైన మౌలిక వసతులను వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో కల్పించేలా సిటీ పోలీస్ విభాగం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ, సురక్షిత రవాణాపై దిశానిర్దేశం చేస్తూ ధూల్‌పేట్, జల్ పల్లి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రధాన కేంద్రాల నుంచి విగ్రహాలను నగరంలోకి సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను పూర్తిగా నివారించాలని, స్థానిక ట్రాఫిక్ పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చి క్లియరెన్స్ పొందాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రవాణా ఏర్పాట్లను ముందస్తుగా పర్యవేక్షించేందుకు వీలుగా విగ్రహాల కొనుగోలుకు సంబంధించి తయారీదారులు ఎప్పటికప్పుడు తమ బుకింగ్ వివరాలను స్థానిక లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. విగ్రహాలను ఆయా మండపాలకు తరలించే ఆగమనం సమయం, మార్గాల గురించిన ముందస్తు సమాచారాన్ని కూడా కచ్చితంగా అందించాలని స్పష్టం చేశారు. అతిపెద్ద విగ్రహాలను తరలించే సమయంలో ఓవర్ హెడ్ విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీసులతో ముందస్తు రవాణా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. విగ్రహాల లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఉపయోగించే క్రేన్లు, రవాణా వాహనాలు కచ్చితంగా సర్టిఫైడ్ అయి ఉండి, అనుభవజ్ఞులైన నిపుణుల ద్వారా మాత్రమే నిర్వహించబడాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు సీపీ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, ట్రాఫిక్ డిసిపిలు కాజల్ సింగ్, రాహుల్ హెగ్డే, గోల్కొండ జోన్ డిసిపి జె. రాఘవేందర్ రెడ్డి, శంషాబాద్ జోన్ డిసిపి బి. రాజేష్‌లతో పాటు పలువురు అదనపు డీసీపీలు, ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, విగ్రహ తయారీదారులు పాల్గొన్నారు.

# 'జె.డి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ'లో "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్) :**
రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ చేపట్టిన "అరైవ్ అలైవ్" ప్రచారంలో భాగంగా గురువారం సోమాజిగూడలోని 'జె.డి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ' కళాశాలలో ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ జి. లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం, బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం , సురక్షిత ప్రయాణ సూత్రాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట సమయం (గోల్డెన్ అవర్) ఎంత కీలకమైనదో నొక్కి చెప్పారు. అలాగే, ప్రమాద బాధితులను భయం లేకుండా కాపాడి ఆసుపత్రులకు తరలించే పౌరులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న "రాహ్-వీర్" (గుడ్ సమరిటన్) అవార్డు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువతలో సురక్షిత డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడం, రోడ్డు భద్రతలో ప్రతి పౌరుడి బాధ్యతను గుర్తుచేయడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్








**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 30 (పీపుల్స్ న్యూస్):**
వర్ష సూచనల ఆధారంగా తమ రోజువారీ ప్రయాణాలను ముందస్తుగా ప్లాన్ చేసుకోవడం మంచిదని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. వర్షాల నేపథ్యంలో గురువారం పంజాగుట్ట, ఖైరతాబాద్ జంక్షన్ల వద్ద వాహనాల రాకపోకలను, రోడ్డుపై ట్రాఫిక్ పరిస్థితులను సీపీ స్వయంగా పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలో వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు పోలీసు శాఖ.. జీహెచ్ఎంసీ సహా ఇతర అన్ని ప్రభుత్వ విభాగాలతో పూర్తి సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. వాతావరణ కేంద్రం విడుదల చేసే సమాచారాన్ని, హెచ్చరికలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లు, తెగిపడిన విద్యుత్ వైర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. నీరు ఎక్కువగా నిలిచే లోతట్టు ప్రాంతాలు, ఫ్లైఓవర్ల వద్ద వాహనదారులు వేగం తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. వాతావరణ కేంద్రం రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతోందని, ఈ నేపథ్యంలోఅత్యవసరమైతే తప్ప వర్షం పడుతున్న సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా ట్రాఫిక్ సహాయం కోసం ప్రజలు డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.ప్రజల సౌకర్యార్థం నగర ట్రాఫిక్ పోలీసు విభాగం ఎప్పటికప్పుడు సోషల్ మీడియా, ఇతర మీడియా ద్వారా విడుదల చేసే అడ్వైజరీలను ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శుక్రవారం, జూలై 31, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక


# ముగ్గురమ్మల స్వరూపం- త్రికూట పర్వత గుహలో వెలసిన వైష్ణోదేవి చరిత్ర ఇదే

వైష్ణోదేవి ఆలయం ప్రసిద్ధి చెందిన అమ్మవారి పుణ్యక్షేత్రం. ఈ పుణ్యక్షేత్రం వైష్ణవ దేవి కొండలపై నెలకొని ఉంది. హిందువులు వైష్ణవ దేవినే మాతా రాణి అని, వైష్ణవి అని కూడా సంభోదిస్తారు. వైష్ణోదేవి యాత్ర చాలామంది చేసి ఉంటారు కానీ అందరికీ అమ్మవారి చరిత్ర గురించి తెలిసి ఉండకపోవచ్చు. ఈ కథనంలో వైష్ణో దేవి ఆలయంలో కొలువైన అమ్మవారి చరిత్ర గురించిన తెలుసుకుందాం.



**ముగ్గురమ్మలు మూర్తీభవించిన దేవిగా!**
తనను దర్శించిన భక్తులకు ధర్మార్థ కామ మోక్షాలు ప్రసాదించే జగజ్జననిగా వైష్ణో దేవి మాత పూజలందుకుంటోంది. ఈ చల్లని తల్లి దర్శనార్థం భక్తులు ఎక్కడెక్కడి నుంచో సంవత్సరం పొడుగునా అశేష సంఖ్యలో తరలి రావడం ఈ తల్లి మహిమకి నిదర్శనం. ఆ దేవిని దర్శించినవరెవరూ రిక్త హస్తాలతో వెను తిరగరని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**వైష్ణోదేవి ఆలయం ఎక్కడుంది?**
వైష్ణోదేవి ఆలయం జమ్ము కశ్మీర్?లోని కాట్రా అనే ప్రదేశంలో పర్వత శిఖరాల్లో సముద్రమట్టానికి 5200 అడుగుల ఎత్తులో వెలసి ఉంది. త్రికూట పర్వత గుహలో వెలసిన వైష్ణోదేవి తన భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి. అత్యంత పురాతనమైన ఈ ఆలయం ఏ యుగానికి చెందినదో ఆధారాలు లేవు. శాస్త్రవేత్తలు తమ పరిశోధనలో ఈ ఆలయం వున్న గుహ ఒక మిలియన్ సంవత్సరాల ప్రాచీనమైనదని కనుగొన్నారు.

**ఉత్తరాది వారి కొంగు బంగారమై విలసిల్లే ఈ దేవి**
వైష్ణోదేవి ప్రాశస్త్యం దక్షిణాదిలో అంత ఎక్కువగా కనబడదు. అందుకే అక్కడివారు ఈ దేవిని లక్ష్మీ స్వరూపమని కొందరు, పార్వతీ స్వరూపమని కొందరు చెబుతారు. నిజానికి మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతి ఈ ముగ్గురి తేజోమయ స్వరూపమే ఈ తల్లి.

**వైష్ణోదేవి పవిత్ర గాథ**
పూర్వం జగన్మాత తాను అసుర సంహారంలో నిమగ్నమై ఉన్న సమయంలో భూలోకంలో ధర్మాన్ని రక్షించి, ప్రజలని కాపాడేందుకు మహాలక్ష్మి, మహాకాళి, మహా సరస్వతుల తేజస్సుతో ఒక శక్తిని ఆవిర్భవింప చేసింది. సంకల్పమాత్రం చేత అక్కడ అందమైన యువతి ప్రత్యక్షమైంది. వారు ఆ యువతిని భూలోకంలో ధర్మ సంరక్షణార్ధం రత్నాకర సాగర్ అనే ఆయనకి పుత్రికగా విష్ణు అంశతో జన్మించి ధర్మ హిత కార్యాలు చేయమని, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత శ్రీ మహా విష్ణువు లో ఐక్యం చెందుతావని చెబుతారు. ఆ మహాశక్తుల ఆదేశానుసారం రత్మాకరసాగర్ ఇంట జన్మించిన ఆ బాలిక వైష్ణవిగా పెరగసాగింది.

**చిరుప్రాయంలోనే తపస్సు**
వైష్ణవి చిన్నతనం నుంచి జ్ఞాన సముపార్జనలో లీనమైంది. తపస్సుతో తన జీవన ధ్యేయం సాధ్యమని తలచి అడవుల్లోకి వెళ్లి తపస్సు చేయసాగింది. అదే సమయంలో 14 సంవత్సరాలు అరణ్యవాసంలో వున్న శ్రీరామచంద్రుడు అక్కడికి వచ్చాడు. వైష్ణవి శ్రీరామచంద్రుణ్ణి ఆ శ్రీమహావిష్ణువుగా గుర్తించి, తనని ఆయనలో లీనం చేసుకోమని కోరింది. శ్రీరామచంద్రుడు దానికి తగిన సమయం కాదని, తన అరణ్యవాసం తర్వాత తిరిగి వైష్ణవి దగ్గరకు వస్తానని , ఆ సమయంలో ఆమె తనని గుర్తిస్తే తప్పక తనలో ఐక్యం చేసుకుంటానని తెలిపాడు.

**శ్రీరాముని గుర్తించని వైష్ణవి**
ఆ ప్రకారమే శ్రీరామచంద్రుడు అరణ్యవాసం, రావణవధానంతరం అయోధ్యకు తిరిగి వెళ్తూ ఆమె దగ్గరకు ఒక వృద్ధుడి రూపంలో వచ్చాడు. కానీ ఆ సమయంలో వైష్ణవి ఆయనని గుర్తించలేకపోతుంది. అందుకని భగవంతునిలో ఐక్యమయ్యే ఆవిడ కోరిక తీరలేదు. అప్పుడు బాధపడుతున్న వైష్ణవిని శ్రీరామచంద్రుడు ఓదార్చి, ఆమె తనలో ఐక్యమవటానికి తగిన సమయమింకా రాలేదని, కలియుగంలో తాను కల్కి అవతారం ధరిస్తానని, అప్పుడు ఆమె కోరిక నెరవేరుతుందని ధైర్యం చెప్పాడు. త్రికూట పర్వత సానువుల్లో ఆశ్రమం నెలకొల్పుకుని తపస్సు కొనసాగిస్తూ, ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలు అవరోహించమని, ప్రజల మనోభీష్టాలు నెరవేర్చి, ప్రజల కష్టాలు తీర్చమని ఆదేశించాడు. శ్రీరామచంద్రుని ఆజ్ఞానుసారం వైష్ణవి త్రికూట పర్వతసానువుల్లో ఆశ్రమాన్ని నెలకొల్పుకుని తన తపస్సు కొనసాగించింది. అనతికాలంలోనే ఆవిడ శక్తిని గ్రహించిన ప్రజలు అమ్మవారి దర్శనం కోసంఆవిడ కోరిక తీరలేదు. అప్పుడు బాధపడుతున్న వైష్ణవిని శ్రీరామచంద్రుడు ఓదార్చి, ఆమె తనలో ఐక్యమవటానికి తగిన సమయమింకా రాలేదని, కలియుగంలో తాను కల్కి అవతారం ధరిస్తానని, అప్పుడు ఆమె కోరిక నెరవేరుతుందని ధైర్యం చెప్పాడు. త్రికూట పర్వత సానువుల్లో ఆశ్రమం నెలకొల్పుకుని తపస్సు కొనసాగిస్తూ, ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలు అవరోహించమని, ప్రజల మనోభీష్టాలు నెరవేర్చి, ప్రజల కష్టాలు తీర్చమని ఆదేశించాడు. శ్రీరామచంద్రుని ఆజ్ఞానుసారం వైష్ణవి త్రికూట త్రికూట పర్వతానికి రావడం మొదలు పెట్టారు.

**భైరవ నాథుని ఆగడాలు**
కొంతకాలం తర్వాత గోరఖ్ నాథ్ అనే తాంత్రికుడు వైష్ణవి గురించి, ఆమె దీక్ష గురించి తెలుసుకుని, శ్రీరామచంద్రుడు ఆదేశించిన ప్రకారం ఆమె ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించిందో లేదో తెలుసుకోవాలనే కుతూహలంతో, వివరాలు తెలుసుకోవడానికి అత్యంత సమర్ధుడైన తన శిష్యుడు భైరవనాథుణ్ణి పంపాడు. భైరవ నాథుడు చాటుగా వైష్ణనిని గమనించాడు. తపస్విని అయినా వైష్ణవి ఎల్లప్పుడు ధనుర్బాణాలు ధరించి వుండటం, ఆవిడకి రక్షగా లంగూర్, ఒక భయంకర సింహం వుండటం గమనించాడు. భైరవ నాథుడు వైష్ణవి అందానికి ముగ్ధుడై తనని వివాహం చేసుకోమని ఆమెని వేదించసాగాడు.

**భైరవ సంహారం**
ఒకానొక సమయంలో భైరవుడు వైష్ణవిపట్ల అమర్యాదగా ప్రవర్తించాడు. అయితే ఈ వివాదం పెద్దది చేసి భైరవుని శిక్షించటం ఇష్టంలేని వైష్ణవి తన తపస్సును కొనసాగించటానికి వాయురూపంలో పర్వతాల్లోకి వెళ్తుంది. కానీ భైరవుడు ఆమెని వదలకుండా వెంటాడుతాడు. ఆ సమయంలో త్రికూట పర్వతంలోని ఈ పవిత్ర గుహ బయట దగ్గర తనను వెంటాడుతున్న భైరవుడి తలని ఒక్క వేటుతో నరుకుతుంది. తెగిన భైరవుడి తల కొంచెం దూరంలో ఒక పర్వత శిఖరం మీద పడింది. అప్పుడు తన తప్పుతెలుసుకున్న భైరవుడు వైష్ణవీదేవిని క్షమించమని ప్రార్ధిస్తాడు. మాత దయతలచి తన భక్తులంతా తన దర్శనం తర్వాత భైరవుణ్ణి దర్శిస్తారని, అప్పుడే వారి యాత్ర సంపూర్ణమవుతుందని వరమిస్తుంది.

**ముగ్గురమ్మల స్వరూపం**
తదనంతరం వైష్ణవి తన ధ్యేయం నెరవేర్చుకోవడానికి, శ్రీ మహావిష్ణువు లో లీనమయ్యే అర్హత సంపాదించుకోవడానికి, త్రికూట పర్వతం పైన గుహలో లక్ష్మి, సరస్వతి, పార్వతి స్వరూపాలైన 3 తలలతో 5.5 అడుగుల ఎత్తయిన రాతి రూపం ధరించింది. వైష్ణోదేవి గుహాలయం లో మనకి కనిపించే మూడు రాతి రూపాలను స్థానిక ప్రజలు పిండి అంటారు. వాటినే మహాకాళీ, వైష్ణో దేవి, మహా సరస్వతి గా అక్కడి పండితులు చెప్పారు ఇదే వైష్ణో దేవి కథ. వైష్ణోదేవి యాత్ర చేయాలనుకునే వారు కాలినడకన, డోలీల్లో, గుర్రాలపై కొండమీదకు చేరుకోవచ్చు. ఎత్తైన కొండల మీద నుంచి కనిపించే అందమైన ప్రకృతి దృశ్యాలు ప్రయాణం బడలికను తెలియనీయదు. యాత్ర మొత్తం భక్తులు 'జై మాతాకీ' అంటూ లయ బద్ధంగా చేసే యాత్రికుల్లో ఎనలేని ఉత్సాహాన్ని కలిగిస్తాయి.

# దైవ దర్శనం తర్వాత శఠగోపం తలపై పెడతారు- ఎందుకో తెలుసా?

సాధారణంగా మనం దేవాలయాలకు వెళ్లినప్పుడు దైవ దర్శనం తరువాత తీర్థ ప్రసాదాలు స్వీకరించాక ఆలయ అర్చకులు శఠారి మన శిరసుపై ఉంచి ఆశీర్వదిస్తారు. ఒక్కోసారి కొందరు ఈ శఠారి తీసుకోకుండానే వెళ్లిపోతుంటారు. కానీ దైవ దర్శనం తరువాత తప్పకుండా తీసుకోవాలని శాస్త్రం చెబుతోంది.



**శఠగోపం అంటే?**
దేవాలయాల్లో దైవ దర్శనం అనంతరం పూజారి మన శిరసుపై ఉంచి ఆశీర్వదించే లోహపు కిరీటాన్ని శఠారి అంటారు. ఈ శఠారి రాగితో కానీ, వెండితో కానీ తయారుచేసినదై ఉంటుంది. శఠారి పైభాగంలో భగవంతుని పాద ముద్రలు ఉంటాయి. అందుకే శఠారి తీసుకునే సమయంలో సాక్షాత్తు భగవంతుని పాదాలు శిరస్సున ధరిస్తున్నామన్న పవిత్ర భావనతో శిరసు వంచి శఠారి స్వీకరించడం ఆలయ మర్యాద, ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాల్సిన సంప్రదాయం.

**శఠారికి ఎందుకంత పవిత్రత**
శఠగోపం సాధారణం వెండి లేదా రాగి వంటి ఉత్తమమైన లోహాలతో తయారు చేస్తారు. ఈ శఠారిని ఎల్లవేళలా భగవంతుని పాదాల వద్ద ఉంచడం వలన దైవశక్తిని నిక్షిప్తం చేసుకుంటుంది. అంతేకాదు గర్భాలయంలో అర్చకులు పఠించే వేద మంత్రోచ్ఛారణల వలన ఏర్పడే శక్తి తరంగాల ప్రకంపనలు కూడా తనలో నిక్షిప్తం చేసుకుని మరింత శక్తివంతంగా మారుతుంది. ఈ శఠగోపాన్ని పూజారి మన శిరసుపై ఉంచగానే అందులోని దివ్య శక్తులు మన శిరసులోని సహస్రార చక్రం ద్వారా శరీరంలోకి ప్రసరించి మానసిక ప్రశాంతత చేకూరుతుంది. అందుకే ఆలయాలకు వెళ్లినప్పుడు శఠారి తీసుకోవడం తప్పనిసరి అని పురాణాలు చెబుతున్నాయి.

**దివ్యానుభూతితో కంపించే శరీరం**
చాలా మంది దేవుని దర్శనం చేసుకుని వచ్చిన పని అయిపోయిందని చక చకా వెళ్ళి ఏదో ఏకాంత నిర్మల ప్రదేశం చూసుకొని కూర్చుంటారు. కొద్దిమంది మాత్రమే ఆగి, శఠగోపం పెట్టించుకుంటారు. శఠగోపం మన నెత్తిన పెట్టగానే ఏదో తెలియని దివ్యానుభూతితో శరీరం కంపించి, మానసిక ఉల్లాసం కలుగుతుంది.

**శఠగోపం కాదు 'శఠగోప్యం'**
శఠగోపం అసలు పేరు శఠగోపం అంటే 'అత్యంత గోప్యమైనది' లేదా రహస్యమైనది అని అర్థం. శఠగోపాన్ని తలమీద ఉంచినపుడు శరీరంలో ఉన్న విద్యుత్, దాని సహజత్వం ప్రకారం శరీరానికి లోహం తగిలినపుడు విద్యుదావేశం జరిగి, మనలోని అధిక విద్యుత్ బయటికెళుతుంది. తద్వారా శరీరంలో ఆందోళన, ఆవేశమూ తగ్గుతాయి. అందుకే శఠగోపాన్ని శఠగోప్యం అని కూడా అంటారు.

**శఠగోపం దేవుని దీవెన**
ఆలయ పూజారి శఠగోపాన్ని మన శిరసుపై ఉంచినప్పుడు మన మనసులో ఉన్న కోరికను భగవంతునికి మానసికంగానే తెలపాలి. భగవంతుని పాదాలను నేరుగా తాకలేని భక్తులకు, ఈ శఠగోపం ద్వారా భగవంతుని పాద స్పర్శను లభించడం వలన ఆ దేవదేవుని అనుగ్రహం తో మన అభీష్టాలు సిద్ధిస్తాయని శాస్త్రం చెబుతోంది.

**శఠగోపం స్వీకరించేటప్పుడు పాటించాల్సిన నియమాలు**
ఆలయ పూజారి శఠగోపాన్ని మన శిరసుపై ఉంచేటప్పుడు మనసులోని కోరికను భగవంతునికి విన్నవిస్తూ, చేతులు కట్టుకొని, శిరసు వంచి, ఏకాగ్రతతో భగవన్నామం స్మరిస్తూ పవిత్రమైన భావనతో శఠగోపాన్ని పెట్టించుకోవాలి. తీర్ధ ప్రసాదాలు స్వీకరించిన తర్వాత మాత్రమే శఠగోపాన్ని పెట్టించుకోవాలి. మానవునికి సహజ శత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ, మదమత్స్యర్యాలకు ఇక నుంచి దూరంగా ఉంటామని భగవంతునికి ఎదుట ప్రమాణం చేయడమే శిరసు వచ్చి శఠగోపం తీసుకోవడం లోని అంతరార్ధం.

**శఠగోపం ఒక అద్భుత సాధనం**
శఠగోపం ఒక సంప్రదాయం మాత్రమే కాదు మానవుడు తరించడానికి మన వేద పురాణాలు ఏర్పాటు చేసిన ఒక అద్భుత సాధనం. శఠగోపం వలన మానసిక ప్రశాంతత లభించడంతో పాటు, ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అందుకే ఆలయానికి వెళ్లినప్పుడు ఏకాగ్రతతో, భక్తితో శఠగోపాన్ని స్వీకరిస్తే జీవితంలో సానుకూల మార్పులు సంభవిస్తాయని విశ్వాసం. ఆ సమయంలో భగవంతుడిని నిస్వార్థంగా కోరికలు కోరితే నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. మనం కూడా ఆలయానికి వెళ్లినప్పుడు పరమ పవిత్రమైన శఠగోపాన్ని స్వీకరించి భగవంతుని అనుగ్రహాన్ని పొందుదాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# పెళ్లైన కొత్తలో - ఈ విషయాలను తప్పనిసరిగా పాటించాలంటున్న నిపుణులు

ఖాళీ కాన్వాస్?పై అందమైన చిత్రాన్ని ఆవిష్కరించాలంటే.. చిత్రకారుడు సరైన రంగులను, కుంచెలను ఎంచుకోవడం అవసరం. దాంపత్య జీవితం కూడా కాన్వాస్ లాంటిదే. కొత్తగా పెళ్లైన దంపతులు తమ కలలకు అనుగుణంగా అందమైన భవిష్యత్తును చిత్రించుకోవాలంటే ఇద్దరి మధ్య చక్కటి సమన్వయం అవసరమంటున్నారు రిలేషన్?షిప్ నిపుణులు. అందుకోసం నూతన దంపతులు కొన్ని ముఖ్యమైన విషయాల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే, వైవాహిక జీవితం ఆనందంగా సాగుతుందని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!మనసారా మాట్లాడుకోవడం : కొత్త జంట స్వేచ్ఛగా, నిజాయతీగా తమ భావాలను పరస్పరం పంచుకోవడం చాలా ముఖ్యం. మీ రోజువారి సంఘటనలు, అనుభవాలు, ఆనందాలు, ఆందోళనలను ఒకరితో ఒకరు పంచుకోవాలంటున్నారు. ఇందుకోసం రోజూ కాస్త సమయం కేటాయించుకోవాలని సూచిస్తున్నారు. దీనివల్ల భాగస్వామి తమను అర్థం చేసుకుంటున్నారని, గౌరవిస్తున్నారని అనిపిస్తుందని చెబుతున్నారు. ఇది బలమైన, ఆరోగ్యకరమైన బంధానికి పునాది లాంటిదని సలహా ఇస్తున్నారు.



ఉపయోగించాలో తెలుసా?ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం : ఆర్థిక లక్ష్యాలపై చర్చించు కుంటూ ఉమ్మడిగా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్, పొదుపు, ఖర్చుల విషయంలో ఇద్దరికీ స్పష్టమైన అవగాహన ఉంటే, భవిష్యత్తులో ఆర్థికపరమైన విభేదాలు తలెత్తకుండా నివారించొచ్చు. ఇందుకోసం నెలలో ఒకరోజును 'ఫైనాన్స్ డేట్'?గా నిర్ణయించుకొని బడ్జెట్ సంబంధ చర్చలు చేసుకోవాలట.గృహమే కదా స్వర్గసీమ : ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇద్దరి ఆలోచనలు, అభిరుచులను ప్రతిబింబించేలా గృహ అలంకరణ ఉండాలంటున్నారు. పని మీద ఎక్కడికి వెళ్లినా, ఇంటికి తిరిగొస్తే అలసట మొత్తం దూది పింజలా ఎగిరిపోయేలా సౌకర్యవంతమైన వాతావరణాన్ని ఏర్పర్చుకుంటే మనసు ఆహ్లాదకరంగా మారుతుందని చెబుతున్నారు.డేట్‌నైట్ సెట్ చేసుకోండి : నెలలో కనీసం ఒక్కరోజైనా ఇద్దరూ ప్లాన్ చేసుకొని బయటకు వెళ్లి రావడాన్ని అలవాటుగా మార్చుకోమంటున్నారు నిపుణులు. ప్రతి నెలా చివరి ఆదివారం లేదా ఏదో ఒక తేదీన రెస్టారెంటుకు వెళ్లి సరదాగా కబుర్లు చెప్పుకొంటూ డిన్నర్ చేయాలట. మీరు వెళ్లే ప్రదేశాలను కూడా తరచూ మారుస్తు ఉండాలని చెబుతున్నారు. దీనివల్ల రొటీన్ లైఫ్ అనే ఫీలింగ్ బయటపడతారని తెలియజేస్తున్నారు.
లైఫ్ పార్టనర్ ఫ్రెండ్స్?ను ఆహ్వానించండి : మీ జీవిత భాగస్వామి ఫ్రెండ్స్ గురించి అడిగి తెలుసుకోమంటున్నారు నిపుణులు. వారి మిత్రబృందాన్ని ఇంటికి ఆహ్వానించి ఆతిథ్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. తద్వారా మీ జీవిత భాగస్వామి పెరిగిన వాతావరణం, వారు స్నేహానికి , బంధాలకు ఇచ్చే విలువ మీకు అర్థమవుతాయని చెబుతున్నారు. దీనివల్ల భార్యభర్తల మధ్య అనుబంధం మరింత ని తెలియజేస్తున్నారు.ప్రేమపూర్వకమైన సందేశం : మొక్కకు రోజూ నీరు పోస్తుంటేనే పచ్చగా ఉంటుంది. లేకుంటే మోడువారిపోతుంది. అదే విధంగా, దాంపత్య బంధాన్ని ఎప్పటికీ సజీవంగా ఉంచుకోవాలంటే ప్రత్యేక శ్రద్ధ చూపలంటున్నారు నిపుణులు. లేకపోతే కాలం గడిచే కొద్దీ అనుబంధం సన్నగిల్లుతోందని హెచ్చరిస్తున్నారు.అందించడం : వివాహం తరువాత దంపతులు తమ వ్యక్తిగత అభిరుచులను, ఆసక్తులను వదులుకోవాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదవడం, సంగీతం నేర్చుకోవడం, స్నేహితులను కలుసుకోవడం, ఇష్టమైన ఆటను కొనసాగించడం ఇలాంటివన్నీ మనసును ఉల్లాసపరుస్తాయని చెబుతున్నారు. కాబట్టి, మీ జీవిత భాగస్వామి తన అభిరుచులను ప్రోత్సహించాలని సలహా ఇస్తున్నారు.

# కాటన్ క్యాండీ కంటే తేలికైన గ్రహాలు- ఖగోళ శాస్త్రవేత్తల అరుదైన ఆవిష్కరణ!

ఖగోళ శాస్త్రవేత్తలు అంతరిక్షంలో అత్యంత అరుదైన జంట 'సూపర్-పఫ్' గ్రహాలను కనుగొన్నారు. 'టాx-791 ఎ', 'టాx-791 గా నామకరణం చేసిన ఈ గ్రహాలు మనం తినే కాటన్ క్యాండీ (బొంబాయి మిఠాయి) కంటే కూడా చాలా తేలికగా ఉండటం విశేషం. ఇవి పరిమాణంలో గురు గ్రహం అంత పెద్దవిగా ఉన్నప్పటికీ, వీటి సాంద్రత మాత్రం దూది మిఠాయి కంటే తక్కువ. అంటే ఏదైనా ఒక పెద్ద నీటి తొట్టెలో వీటిని ఉంచగలిగితే, ఇవి నీటిపై సులభంగా తేలియాడతాయి. ఇప్పటివరకు కనుగొన్న 'గ్యాస్ జెయింట్' (+ఖం +ఖుత్) గ్రహాలన్నింటిలోనూ అత్యల్ప సాంద్రత () కలిగిన గ్రహాల జాబితాలో ఇవి చేరాయి.భూమికి 1,110 కాంతి సంవత్సరాల దూరంలో.. ఒకే నక్షత్రం చుట్టూ ప్రదక్షిణలు!ఈ రెండు గ్రహాలు భూమికి సుమారు 1,110 కాంతి సంవత్సరాల దూరంలో దక్షిణ ఆకాశంలోని 'వోలాన్స్' అనే నక్షత్ర రాశిలో ఉన్నాయి. ఇవి ఖీ7-రకానికి చెందిన ఒక మరుగుజ్జు నక్షత్రం చుట్టూ తిరుగుతున్నాయి. ఖగోళ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, ఈ రెండు గ్రహాలు 'తోబుట్టువులు'. ఎందుకంటే తమ నక్షత్రం ఏర్పడిన తొలినాళ్లలో, దాని చుట్టూ ఉన్న ఒకే వాయువు, ధూళి డిస్క్ నుంచి ఇవి రెండూ కలిసే ఏర్పడ్డాయి. ఒకే పదార్థంతో, ఒకే సమయంలో పుట్టడం వల్ల వీటి లక్షణాలు, కూర్పు దాదాపు ఒకేలా ఉండే అవకాశం ఉందని విశ్వసిస్తున్నారు.ఒకే నక్షత్రం చుట్టూ, ఒకేసారి ఏర్పడిన రెండు సూపర్-పఫ్ గ్రహాలు దొరకడం చాలా అరుదు. అందుకే ఈ వ్యవస్థపై శాస్త్రవేత్తలు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు.దూది మిఠాయి కన్నా తక్కువ సాంద్రత!:ఈ గ్రహాల అత్యల్ప సాంద్రతకు సంబంధించిన గణాంకాలు ఖగోళ శాస్త్రవేత్తలను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇందులో 'టాx-791 ఎ' సాంద్రత కేవలం 0.038 గ్రాములు/క్యూబిక్ సెంటీమీటర్ (గ్ర/ఛఎట) కాగా, దాని తోబుట్టువు 'టాx-791 ఛసాంద్రత 0.047 గ్రాములు/క్యూబిక్ సెంటీమీటర్‌గా నమోదైంది.మన సౌర కుటుంబంలోని గురు




గ్రహం సాంద్రత 1.33 గ్రా/సెం.మీటగా ఉంటుంది. అంటే ఈ 'సూపర్-పఫ్' గ్రహాల కంటే గురు గ్రహం దాదాపు 28 నుండి 35 రెట్లు ఎక్కువ సాంద్రత కలిగి ఉంది.మనం తినే దూది లేదా బొంబాయి మిఠాయి (క్యాండీ ఫ్లాస్) సాంద్రత సుమారు 0.05 గ్రా/సెం.మీటగా ఉంటుంది. ఈ లెక్కన 'టాx-791 ఎ' గ్రహం ఆ మిఠాయి కంటే కూడా తక్కువ సాంద్రతను కలిగి ఉండటం విశేషం.మరోవైపు, భూమి సగటు సాంద్రత 5.51 గ్రా/సెం.మీటతో పోలిస్తే 'టాx-791 ఎ' దాదాపు 145 రెట్లు, 'టాx-791 ఛ' దాదాపు 117 రెట్లు తేలికగా ఉంటాయి. ఇంత తక్కువ సాంద్రత ఉండటం వల్లే వీటిని 'సూపర్-పఫ్' గ్రహాలు అంటున్నారు. ఇవి గ్యాస్‌తో నిండిన పెద్ద బెలూన్ల లాంటివన్నమాట.5:3 రెజొనెన్స్‌లో బంధీలుగా తోబుట్టువులు!: ఈ రెండు గ్రహాల మధ్య అరుదైన గురుత్వాకర్షణ బంధం ఉంది. దీన్ని ఖగోళ శాస్త్రంలో '5:3 మీన్-మోషన్ రెజొనెన్స్' అని పిలుస్తారు. అంటే లోపలి గ్రహం తన నక్షత్రం చుట్టూ ఐదు సార్లు తిరిగేలోపు, బయటి గ్రహం మూడు కక్ష్యలను మాత్రమే పూర్తి చేస్తుంది.ఈ ప్రత్యేక రెజోనెన్స్ కారణంగా, ఈ రెండు గ్రహాలు నిరంతరం ఒకదానిపై ఒకటి క్రమబద్ధమైన గురుత్వాకర్షణ ప్రభావాన్ని (బస్త్రం) చూపుకొంటాయి. దీనివల్ల అవి తమ నక్షత్రం ముందు నుంచి దాటి వ టళ్లే సమయాల్లో కొద్దిపాటి వ్యత్యాసాలు సంభవిస్తాయి.ఈ 'ట్రాన్సిట్ టైమింగ్' మార్పులను కొలవడం ద్వారానే శాస్త్రవేత్తలు ఈ గ్రహాల ద్రవ్యరాశి (ళుం), కక్ష్యలను అత్యంత కచ్చితంగా లెక్కగట్టగలుగుతున్నారు. ఇలా ఒకే నక్షత్రం చుట్టూ తిరుగుతూ, గురుత్వాకర్షణ బంధంతో లాక్ అయి ఉండటం వల్లే వీటిని నిజమైన ఖగోళ 'తోబుట్టువులు'గా పరిశోధకులు అభివర్ణిస్తున్నారు.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అధ్యయనం: ఈ పరిశోధనకు యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ నేతృత్వం వహించగా, యూనివర్సిటీ కోట్ డి'అజుర్/అబ్జర్వేటరీ డి లా కోట్ డి'అజుర్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ సంస్థలు సహకరించాయి. ఈ అధ్యయనం జూన్ 25న 'మంత్లీ నోటీసెస్ ఆఫ్ ది రాయల్ ఆస్ట్రానమికల్ సొసైటీ' జర్నల్‌లో జూన్ 25న ప్రచురితమైంది.

# వీర్లపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

:- బాధితులకు అండగా ఉంటామని భరోసా






రామగుండం,జులై 30
గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆర్.ఎఫ్.సి.ఎల్. పహరి గోడ కూలిపోవడంతో వరద నీరు వీర్లపల్లి గ్రామంలోని పలు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్,అడిషనల్ కలెక్టర్ లతో కలిసి గురువారం వీర్లపల్లి గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులను అప్రమత్తం చేస్తూ బాధితులకు అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భరోసా ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య,కార్పోరేటర్లు, నాయకులు,అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలను వెయ్యాలి



తుర్కపల్లి, జులై 30
రైతులు ఆరుతడి పంటలను వేయాలని పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా లు అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలోని రైతు వేదిక నందు ఎల్ నీనో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన విత్తనమేల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం సాధారణము కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట పంటల సాగుకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు .రైతులు అధికరణీటి అవసరం ఉన్న పంటలకు బదులు స్థానిక పద్ధతులను అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన రైతులు స్వల్పకాలికంగా పండే కందులు, మినుములు, కూరగాయలు వేయాలని సూచించారు. విత్తనమేల కార్యక్రమంలో భాగంగా కంది ,కూరగాయల విత్తనాలను రైతులకు అందజేశారు .ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ పని గట్ల సుదర్శన్ ,సర్పంచ్ సీతరాజు, ఉపసర్పంచ్ మంగ్యా నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ ,రైతులు పాల్గొన్నారు

# పదవీ విరమణ పొందుతున్న ముప్పిడి రవీందర్ రెడ్డి కి ఘన సన్మానం

రామగుండం జులై 30
రామగుండం ఏరియా.1లో పర్సనల్ మేనేజర్గా సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందిస్తూ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న ముప్పిడి రవీందర్ రెడ్డి ని గురువారం ఆర్జి.1 ఏరియా బంగ్లోస్ ఏరియా ఇల్లంద్ క్లబ్ నందు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జి.1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ హాజరై రవీందర్ రెడ్డి ని శాలువాతో సత్కరించి,జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ రవీందర్ రెడ్డి తన 37 సంవత్సరాల సర్వీసులో ఉద్యోగుల సంక్షేమం,కార్మిక సమస్యల పరిష్కారం, హెచ్ఆర్ విధానాల అమలులో చూపిన చిత్తశుద్ధి అభినందనీయమని కొనియాడారు.ప్రతి ఉద్యోగి సమస్యను సొంత సమస్యగా భావించి పరిష్కరించే గుణం ఆయనలో ఉందని, ఆయన సేవలు సింగరేణికి ఆదర్శమని అన్నారు.పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా,సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, శాఖాధిపతులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు,కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రవీందర్ రెడ్డి ఎల్లప్పుడూ చిరునవ్వుతో,అందరితో ఆప్యాయంగా మెలిగేవారని,కార్మికులకు, అధికారులకు మధ్య వారధిలా వ్యవహరించారని గుర్తు చేసుకున్నారు.సన్మానానికి




స్పందించిన ముప్పిడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తన సర్వీసు కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.సింగరేణి సంస్థ తనకు అన్ని విధాలుగా ఎంతో ఇచ్చిందని,జీవితాంతం సంస్థ రుణం తీర్చుకోలేనిదని తెలిపారు.

# ఆగస్టు 1న తపస్ మహాధర్నా చలో హైదరాబాద్

- మన సమస్యకు మనమే ప్రతినిధి
- రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి




నారాయణపేట,జూలై 30
ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల సాధన కోసం ఆగస్టు 1న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, రవీందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వాళ్లు మక్తల్లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న సమస్యల సాధన కోసం అనేకసార్లు విన్నవించిన ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే మండల జిల్లా స్థాయి ధర్నాలు పూర్తి కావడం జరిగిందని ఇక రాష్ట్ర రాజధానిలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పిఆర్సి వెంటనే ప్రకటించాలని,ఆరు డీఏలు విడుదల చేయాలని, సిపిఎస్ విధానం రద్దు పరిచి పాత పెన్షన్ అమలు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని,కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటిఎస్ అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులు మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ గురుకుల ఉపాధ్యాయ సమస్యలు తీర్చాలని, టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ తో ఈ మహాధర్న చేపడుతున్నట్లు తెలిపారు.ప్రతి మహాధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి:

- ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్

చిట్యాల జులై 30
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సౌమ్య విద్యామందిర్ పాఠశాల ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్ అన్నారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాలలో గురువారం గోరింటాకు వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీలు, విద్యార్థినీలు గౌరీదేవి పూజతో పాటు మైదాకు చెట్టు, రోలుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహజ గోరింటాకు ఆకులను నూరి సంప్రదాయ పాటలు పాడుకుంటూ ఒకరి చేతులకు మరొకరు గోరింటాకు అలంకరించుకుని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ గోరింటాకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సహజ గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలు కలిగి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో రసాయనాలతో తయారయ్యే కోన్ మెహందీలకు బదులుగా



సహజ గోరింటాకును ఉపయోగించాలని సూచిస్తూ, విద్యార్థులకు గోరింటాకు విశిష్టత, ఆరోగ్య ప్రయోజనాలు, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన, అనుబంధాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, గంధమల్ల చర్విత, రేగులగడ్డ ప్రశాంతి, ఆయా పొలిమేర మంజుల, విద్యార్థులు సూరోజు శ్రీకృష్ణప్రియ, బోగ పవిత్ర, రుద్రారపు ప్రణవి, పిడుగురాళ్ల నేహిత, రొండి కార్తీక్, దంతూరి అఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం పాత బజారులో పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే

రామగుండం,జులై 30
రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గం లోని పాత బజారు ప్రాంతంలో ఏర్పడిన పరిస్థితులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్తో కలిసి పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు,ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని,అత్యవసరం అయితే తప్ప వరద ప్రభావిత ప్రాంతాల్లో సంచరించవద్దని విజ్ఞప్తి చేశారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఎమ్మెల్యే వెంట రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి,కార్పోరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



# బిజెపి పాలనలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం

- నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి
- గడ్డం వెంకటేష్, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు

రాజపేట జులై 30
బిజెపి అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల కాలంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని రూపాయి విలువ పతనం అయిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ అన్నారు. గురువారం పార్టీ మండల కార్యదర్శి కటికల రామచంద్రం అధ్యక్షతన జరిగిన మండల సెమినార్ లో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల పాలనలో ప్రజల జీవన స్థితిగతులు అస్తవ్యస్తంగా మారాయని తీవ్రమైన ఆర్థిక సంక్షోభం రూపాయి విలువ పతనమైందని 2014లో డాలర్ విలువ 58 రూపాయలు ఉంటే 2026 వచ్చేసరికి 96 రూపాయలు దిగజారిందని వారు




అన్నారు. అదేవిధంగా ప్రజలు నిత్యం ఉపయోగించే పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై ధరల భారాన్ని మోపారని 2014లో లీటర్ పెట్రోల్ 56 రూపాయలు ఉంటే 2026 వచ్చేసరికి 110 రూపాయలు పెరిగిందని ఎల్పిజి గ్యాస్ 2014లో 414 రూపాయలు ఉంటే ప్రస్తుతం 965 రూపాయలు పెరిగిందని వారు అన్నారు. 12 ఏళ్ల పాలనలో రైతాంగాన్ని నిలువునా ముంచే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చారని కార్మికులను వారి బతుకులను గందరగోళపరిచే నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని ప్రభుత్వం రంగాన్ని దివాలా తీయించి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించిందని దళితులు గిరిజనులపై అత్యాచారాలు పెరిగినవని మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగాయని వారు అన్నారు. అబద్దాలతో బీజేపీ రాజ్యమేలుతూ మీడియా గొంతునొక్కి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని వారు అన్నారు. సర్ పేరుతో బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించాలని చూస్తున్నారని. ప్రజలు గమనించి బిజెపి పాలనను ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు. వీరితోపాటు పార్టీ సీనియర్ నాయకులు పబ్బోజు రాధమ్మ జ్యోతి బాణాల చలం నరసింహ శ్రీశైలం అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# గొడ్డలి పార్టీ జగన్ రెడ్డికి ఆ ఇంగిత జ్ఞానం లేదు

- నేర ఆరోపణలు ఎదుర్కొంటోన్న వ్యక్తికి పరామర్శా
- దానయ్య కుటుంబాన్ని పరామర్శించాల్సిన బాధ్యత లేదా
- గొడ్డలి పార్టీ అంటేనే అసభ్య చేష్టల పార్టీ
- జైలులో ఉన్న జగన్ రెడ్డికి ములాఖత్ నిబంధనలు తెలియవా
- సొంత చెల్లిని పరామర్శించని వాడు సమాజం గురించి మాట్లాడడం విడ్డూరం
- మంత్రి కొండపల్లి



**విజయనగరం, జూలై 30 :** బాధితులకు అండగా నిలవాల్సింది పోయి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని పరామర్శించడం గొడ్డలి పార్టీ అధినేత వైఎస్. జగన్ రెడ్డికే చెల్లిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గొడ్డలి పార్టీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు యాక్సిడెంట్‌లో ప్రాణం పోయిన దానయ్య కుటుంబాన్ని పరామర్శించాలన్న ఇంగిత జ్ఞానం జగన్ రెడ్డికి లేకపోవడం బాధాకరం అని మంత్రి వాపోయారు. జైలులో ఉండి వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు ములాఖత్ నిబంధనలు తెలియవా... నిర్ణీత సమయంలో కలవకుండా.. శ్రీకాకుళం పర్యటనలో కేవలం బల ప్రదర్శన చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ నాయకులు విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారులతో అసభ్య ప్రవర్తన, దాడులకు ప్రేరేపించడమేనా మీ గొడ్డలి పార్టీ కార్యకర్తలకు మీరు ఇచ్చే సందేశం అని మంత్రి ప్రశ్నించారు. మహిళా ఎస్సై ప్రవల్లికపై వైసీపీ నేతల దాడి హేయమైన చర్య అని.. గొడ్డలి పార్టీ అంటేనే అసభ్యపార్టీ.. అందుకే మహిళల విషయంలో దారుణంగా ప్రవర్తించారని మంత్రి పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ అధినేత తన పార్టీ పేరు సార్థకం చేసేలా ఎప్పుడూ నేరగాళ్లనే సమర్థిస్తారని... ఆస్పత్రిలో ఉన్న సొంత చెల్లెలిని పరామర్శించలేని వ్యక్తి నేర ఆరోపణలు ఎదుర్కొంటోన్న వారిని పరామర్శించడం రాజకీయ లబ్ధి కోసం ఆడుతోన్న నాటకం కాదా ? అని ప్రశ్నించారు. సొంత కుటుంబానికే విలువ ఇవ్వని వాడు.. సమాజం, ప్రజల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నిబంధనలు విస్మరిస్తే ఊరుకునేది లేదని... చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి కొండపల్లి హెచ్చరించారు.

## సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వడియారం గ్రామంలో వర్షాల ముందస్తు చర్యలు



**చేగుంట జూలై 30**

చేగుంట మండలం వడియారం గ్రామంలో భారీ వర్షాల నేపథ్యంలో పూరి గుడిసెలు కూలిపోయే స్థితిలో ఉన్న పెంకుటిళ్లలో నివసిస్తున్న ప్రజలను సర్పంచ్ అంకన్నగారి సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు.ప్రజల భద్రత దృష్ట్యా ఎమర్జెన్సీ నివాసం కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల లో గదులను ఏర్పాటు చేశారు.ఎవరికైనా ఎమర్జెన్సీ ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు.

# సభా స్థలాన్ని పరిశీలించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రోగ్రాం ఇన్చార్జి మంతెన సత్యనారాయణ రాజు







**విజయనగరం, జులై 30**

ఆగస్టు ఒకటో తేదీన భోగాపురం శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ గారు ప్రారంభించిన అనంతరం నిర్వహించే సభా స్థలాన్ని గురువారం రాత్రి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రోగ్రాం ఇన్చార్జి మంతెన సత్యనారాయణ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలోని వివిఐపి, విఐపి, భూములు ఇచ్చిన రైతులు, జిఎంఆర్ సంస్థ కుటుంబ సభ్యులు, ఛాంపియన్స్, మీడియా సభ్యులు గ్యాలరీ లను పరిశీలించారు. సభా స్థలంలో వేసిన వేదికలు మధ్యన వర్షం పడినట్లయితే నీరు ఇంకెలా చర్యలు తీసుకోవాలని సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో 88 మంది అనాధలకు అన్న ప్రసాదన్న వితరణ



**చేగుంట జూలై 30**

లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శివంపేట మండలం మగ్ధంపూర్ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.బేతాని సంరక్షణ అనాథ ఆశ్రమంలోని 88 మంది అనాధలకు అన్న ప్రసాద వితరణ పండ్లుఅందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు మాట్లాడుతూ "సేవే పరమ ధర్మం. మనిషి జీవితానికి





నిజమైన అర్థం అతను సంపాదించిన సంపదలో కాదు, సమాజానికి అందించిన సేవల్లో ఉంది. పదవులు, బాధ్యతలు గౌరవాలు పొందడమే కాకుండా వాటిని ప్రజాసేవకు ఉపయోగించిన వారే సమాజంలో స్థిరంగా నిలిచిపోతారు" అని అన్నారు. లయన్ ఘట్టమనేని బాబురావు అలాంటి సేవా తపన కలిగిన వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పీఎంఏజీవై కింద మంజూరైన నిధులను సత్వరమే వినియోగించి పనులు పూర్తి చేయాలి
- ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఆదేశాలు









**విజయవాడ: జూలై 30,2026.**

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (గ్రహీూ‌ఃF) పథకం కింద ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన పీఎంఏజీవై పథకం సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధే ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కేంద్ర ప్రాయోజిత పథకమైన ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా షెడ్యూల్డ్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 100 శాతం గ్రాంట్‌ను అందజేస్తుందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు, సామాజిక-ఆర్థిక అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, డిజిటలైజేషన్, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి పది కీలక రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేపట్టడమే పథకం ఉద్దేశ్యమని వివరించారు. జిల్లాలోని





16 మండలాల్లో 2018-19 నుండి 2025-26 మధ్య (2021-22 మినహా) ఐదు దఫాలుగా మొత్తం 84 గ్రామాలను ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2018-19 నుండి 2020-21 వరకు ఫేజ్-1లో ఎంపికైన 33 గ్రామాల అభివృద్ధి కోసం రూ.6,05,63,908 మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.1,43,62,549 వ్యయం చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.4,62,01,359 నిధులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 2022 నుండి 2025-26 వరకు ఎంపికైన 51 గ్రామాలకు సంబంధించి మొత్తం 359 అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రతి ఆదర్శ గ్రామానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.1,020 లక్షల నిధులు అవసరమవుతాయని తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖకు రూ.1,340.45 లక్షలు, గ్రామీణ నీటి సరఫరా శాఖకు రూ.270.05 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నిధులను సకాలంలో వినియోగించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదర్శ గ్రామాల్లో సోలార్ లైట్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎస్సీ వర్గాల నివాస ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి నిజమైన ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమం తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రాధాన్యత క్రమంలో నిధులను వినియోగించి అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక ప్రకారం పనుల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.సి. ఆనంద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.శ్రావణ బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమం





**చేగుంట జూలై 30**

లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు శివంపేట మండలం మగ్ధంపూర్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు.బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమం, మగ్ధంపూర్ లో పర్యావరణ పరిరక్షణకొరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సంచారం -- భయంలో గ్రామీణులు

**ప్రతిరోజూ వీధిలో కుక్కల కాపలా... చిన్న పిల్లలు, మహిళలకు తప్పని తిప్పలు**



**చేగుంట జులై 30**

చేగుంట మండల కేంద్రంలోని సన్నటి గల్లీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఆ దారి పొడవునా గుంపులుగా చేరి తీక్షణంగా చూస్తున్న కుక్కలను దాటుకొని వెళ్లాలంటే బాటసారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రతిరోజూ ఈ ఇరుకు మార్గం నుంచే పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, ఒంటరిగా నడిచే మహిళలు మరియు వృద్ధులు ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వణికిపోతున్నారు. వేరే ప్రాంతాల్లో వీధి కుక్కల దాడిలో చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దారిలోనే కోతులు కూడా కాపు కాచి కూర్చుంటుండటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలు, కోతుల ముప్పు నుండి ఊరట కలిగించాలని, ఏదైనా జరగరాని ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పరిస్థితి తీవ్రంగా ఉన్నందున చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్



చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు జాక్‌పాట్ తగిలింది. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు.. ఏకంగా ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ పదవి వరించింది. 18 ఏళ్ల తర్వాత ఫ్లెమింగ్‌పై సీఎస్‌కే వేటు వేగయా.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. హెడ్ కోచ్‌గా స్వాగతం పలికింది. ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ సారథిగా తిరిగి జోరూట్‌ను ఎంపిక చేసింది.బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికడంతో అనుభవం కలిగిన జోరూట్‌కే ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) మళ్లీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్ట్ టీమ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ఈసీబీ గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ బోర్డు ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన కోచ్‌ల్లో ఒకరైన ఫ్లెమింగ్ రాకతో టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఒక కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ తెలిపాడు. 'టెస్ట్ కోచ్‌గా ఇంగ్లండ్ జట్టులో చేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కోచింగ్ పదవుల్లో ఇది ఒకటి. అలాంటి పదవి బాధ్యతలను చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఆటగాళ్లతో పని చేయడానికి, బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ సాధించిన ప్రగతిని కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక ప్రణాళికలతో జట్టుకు విజయాలను అందించే ప్రయత్నం చేస్తాం. జట్టులోని యువ ప్రతిభావంతులకు సాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం.'అని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల సేవలందించాడు. ఈ 18 సంవత్సరాల్లో 10 సార్లు జట్టును ఫైనల్‌కు చేర్చడంతో పాటు ఐదు టైటిళు అందించాడు. సీఎస్‌కేకు చెందిన ఇతర గ్లోబల్ ఫ్రాంచైజీలకు కూడా కోచ్‌గా సేవలందించాడు. న్యూజిలాండ్ కెప్టెన్‌గా 80 మ్యాచ్‌ల్లో 28 విజయాలు అందించాడు. కౌంటీ క్రికెట్‌లో నాటింగమ్‌షైర్ జట్టుకు సారథిగా వ్యవహరించి 2005 కౌంటీ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందించాడు. 2017 నుంచి 2022 వరకు కెప్టెన్‌గా కొనసాగిన జోరూట్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. గతంలో 64 టెస్ట్‌ల్లో జోరూట్ 27 విజయాలు అందించాడు. ఇంగ్లండ్ సారథ్య బాధ్యతలను తిరిగి చేపట్టడం గర్వంగా ఉందని జోరూట్ తెలిపాడు. ఈ బాధ్యతల్లో కొనసాగడం ఎంతో కష్టమైనప్పటికీ.. సంతృప్తినిస్తోందని చెప్పాడు. స్టీఫెన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని వెల్లడించాడు.



# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్య రహానే గుడ్‌బై..

భారత స్టార్ బ్యాటర్, మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్, క్లాసిక్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతూ గురువారం సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ వీడియో ద్వారా రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. జీవితంలో సరైన సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగక తప్పదని ఈ సందర్భంగా అతడు ఉద్వేగభరితంగా పేర్కొన్నాడు. తనకు అండగా నిలిచిన బీసీసీఐకి, తన తోటి ఆటగాళ్లకు, కోచ్‌లకు, కోట్లాది మంది అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. 2011లో ఇంగ్లండ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రహానే, ఆ తర్వాత కొన్ని రోజులకే రాహుల్ ద్రావిడ్ ఫేర్‌వెల్ సిరీస్‌లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక 2013లో ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. విరాట్ కోహ్లీ, పుజారాలతో కలిసి మిడిలార్డర్‌లో భారత జట్టుకు బలమైన వెన్నెముకగా నిలిచాడు. కఠినమైన విదేశీ పిచ్‌లపై అతడు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును ముందుండి నడిపించిన తీరు అతడి కెరీర్‌లోనే ఒక సువర్ణాధ్యాయం. కోహ్లీ గైర్హాజరీలో జట్టు బాధ్యతలు చేపట్టి, యువ ఆటగాళ్లతో అద్భుతాలు సృష్టించాడు. మెల్‌బోర్న్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి జట్టుకు చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్ అతడి నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి చాటిచెప్పింది. భారత్ తరఫున 85 టెస్టులు ఆడిన రహానే 5077 పరుగులు సాధించాడు. అలాగే 90 వన్డేల్లో 2962 పరుగులు, 20 టీ20 మ్యాచుల్లో 375 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. జులై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచే అతడి కెరీర్‌లో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో తాను కొనసాగుతానని రహానే స్పష్టం చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026లో కూడా అతడు ఆడాడు. పదేళ్లకు పైగా తన అద్భుత ఆటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్న ఈ సైలెంట్ వారియర్ రిటైర్మెంట్ వార్త అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

# భారత హాకీ కిట్ కలర్ మార్పుపై రచ్చ!



భారత హాకీ జట్ల జెర్సీ రంగును బ్లూ నుంచి కాషాయ రంగుకు (ఆరెంజ్) మార్చడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హాకీ ఇండియా స్పష్టం చేసింది. వచ్చే నెలలో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జాతీయ జట్ల జెర్సీ రంగును అనూహ్యంగా మార్చేసింది. దశాబ్దాలుగా భారత జట్టుకు ఐడెంటిటీగా ఉన్న సంప్రదాయ బ్లూ జెర్సీ స్థానంలో కొత్తగా కాషాయం (ఆరెంజ్) రంగు కిట్‌ను పరిచయం చేసింది. ఈ నిర్ణయంపై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జెర్సీ రంగు మార్చడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రంగు మార్పుపై సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా సీనియర్ అధికారి ఒకరు.. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని కొట్టిపారేశారు. జాతీయ జెండాలో కాషాయం ఒక భాగమని, మార్పును ఎప్పుడూ స్వాగతించాలని ఆయన సూచించారు. సంప్రదాయ బ్లూ జెర్సీని మార్చడానికి ప్రధాన కారణం ఆటగాళ్ల విజిబిలిటీ అని ఆ అధికారి వివరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా బ్లూ టర్ఫ్ (మైదానం) పైనే జరుగుతున్నాయి. మైదానం రంగు, జెర్సీ రంగు ఒకేలా ఉండటం వల్ల ఆటగాళ్లను గుర్తించడం వీక్షకులకు కష్టంగా మారుతోంది. ఆరెంజ్ రంగు వల్ల కాంట్రాస్ట్ పెరిగి, టర్ఫ్‌పై ఆటగాళ్లు స్పష్టంగా కనిపిస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త కిట్‌ను ఆవిష్కరిస్తూ హాకీ ఇండియా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. జెర్సీలోని ప్రతి కుట్టు ఒక కథను చెబుతుందని, ప్రతి రంగు దేశ గర్వాన్ని చాటుతుందని పేర్కొంది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయాలకు ప్రతీక అని వెల్లడించింది. ఉదయిస్తున్న సూర్యుడి స్ఫూర్తితో రూపొందించిన ఈ డిజైన్ సరికొత్త ఆరంభానికి సంకేతమని వివరించింది. ఇందులో తెలుపు రంగు ప్రత్యామ్నాయ జెర్సీలు కూడా ఉంటాయి. జెర్సీ మార్పు నిర్ణయం తనకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించిందని వీరేన్ రస్కిన్హా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగుతోనే ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల పాటు గర్వంగా బ్లూ జెర్సీ ధరించానని, అభిమానులు కూడా మన జట్టును ఆ రంగులోనే చూడాలని కోరుకుంటారని అభిప్రాయపడ్డారు. తన వాదన కేవలం జాతీయ జట్టు గుర్తింపు, వారసత్వం గురించేనని రస్కిన్హా స్పష్టం చేశారు.

# లాంగ్ జంప్‌లో శ్రీశంకర్‌కు సిల్వర్



- పారా అథ్లెటిక్స్‌లో డబుల్ డిలైట్
- 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలు

**గ్లాస్గో (స్కాట్లాండ్):** 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు మరో పతకం లభించింది. కేరళ అథ్లెట్ మురళీ శ్రీశంకర్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్‌తో మెరిశాడు. బుధవారం అర్ధరాత్రి అనంతరం జరిగిన పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో శ్రీశంకర్ 8.09 మీటర్ల జంప్‌తో ద్వితీయ స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన మరో అథ్లెట్ లోకేశ్ సత్యనాథన్ 7.97 మీటర్ల జంప్‌తో ఐదో స్థానంలో నిలిచి పతకానికి దూరమయ్యాడు. 2022 బర్మింగ్‌హామ్‌లో తొలిసారి బరిలోకి దిగి పతకం సాధించిన మురళీ శ్రీశంకర్.. కామన్‌వెల్త్ క్రీడల్లో వరుసగా రెండో మెడల్ సాధించాడు. జమైకా అథ్లెట్, మాజీ ప్రపంచ చాంపియన్ తజల్ గేల్ 8.15 మీటర్లలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నాడు. 8.08 మీటర్ల జంప్‌తో స్కాట్లాండ్‌కు చెందిన స్టిఫెన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 8.03 మీటర్ల జంప్ చేసిన మురళీ శ్రీశంకర్.. రెండో ప్రయత్నంలోనే 8.09 మీటర్ల పతక జంప్ చేశాడు. ఆ తర్వాత వరుసగా రెండు ప్రయత్నాలు ఫౌల్ కాగా.. చివరి రెండు ప్రయత్నాల్లో 7.94మీటర్లు, 7.97 మీటర్ల జంప్‌తో సరిపెట్టాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా గాయంతో దూరమైన మురళీ శ్రీశంకర్ తాజాగా గ్లాస్గోలో కామన్‌వెల్త్ క్రీడల సిల్వర్ మెడల్‌తో తనేంటో నిరూపించుకున్నాడు. ఇదిలా ఉండగా, భారత పారా అథ్లెట్లు ఒకే ఈవెంట్లో రెండు పతకాలు సాధించారు. పురుషుల 100 మీటర్ల టీ47 ఫైనల్లో దిలీప్ గవిట్, మహ్మద్ బసిల్‌లు సత్తా చాటారు. 10.71 సెకండ్లలో రేసును ముగించిన దిలీప్ బంగారు పతకం సాధించగా, 10.83 సెకండ్లతో మహ్మద్ బసిల్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో జాతీయ రికార్డు బద్దలుకొట్టిన పారుల్ చౌదరి 9.26.75 టైమింగ్‌తో ఐదో స్థానానికి పరిమితమై పతకం చేజార్చుకుంది.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన నీరజ్ చోప్రా



స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్ ఎనిమిదో రోజు పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ జట్టుకు శుభవార్తగా, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతనితో పాటు భారత అథ్లెట్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ కూడా ఫైనల్‌లోకి ప్రవేశించారు. దీంతో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు పతక అవకాశాలు మరింత బలపడ్డాయి. ఈ విభాగానికి సంబంధించిన పతకాల పోటీలు జూలై 31న జరగనున్నాయి. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్‌లో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాల్స్ పోటీలు కొనసాగుతుండగా, ట్రాక్ సైక్లింగ్‌లో కూడా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు జావెలిన్ త్రో ఫైనల్‌పై కేంద్రీకృతమైంది. స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుడిగా భావిస్తున్న నీరజ్ చోప్రా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అంచనాలకు తగ్గ ప్రదర్శన చేయకపోయినా, ఫైనల్‌లోకి సులభంగా అర్హత సాధించాడు. జావెలిన్ త్రోలో నేరుగా ఫైనల్‌కు చేరాలంటే 85 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌ను అధిగమించాల్సి ఉంటుంది. అయితే తొలి ప్రయత్నంలో నీరజ్ 76.28 మీటర్లు మాత్రమే విసరగలిగాడు. దీంతో నేరుగా అర్హత సాధించే మార్క్‌ను అందుకోలేకపోయాడు. అయితే రెండో ప్రయత్నంలో తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్న నీరజ్ 79.61 మీటర్లు జావెలిన్ విసిరి మొత్తం ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత జట్టుకు చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచారు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్‌వీర్ సింగ్ 74.45 మీటర్లు నమోదు చేసి ఇద్దరూ ఫైనల్‌లో చోటు దక్కించుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ తొలి ప్రయత్నంలోనే విఫలమవడం ఆసక్తికరంగా మారింది. అనంతరం మూడు ప్రయత్నాలు పూర్తి చేసిన అతను గరిష్టంగా 78.63 మీటర్లు మాత్రమే నమోదు చేశాడు. ఫైనల్‌లో నీరజ్ చోప్రాకు అర్షద్ నదీమ్‌తో పాటు శ్రీలంకకు చెందిన యువ ప్రపంచ ఛాంపియన్ రుమేష్ పతిరాగేల నుంచి గట్టి సవాల్ ఎదురుకానుంది. ఈ ముగ్గురు మధ్య స్వర్ణ పతక పోరు ఉత్కంఠభరితంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మహిళల 4000 మీటర్ల క్వాలిఫికేషన్ రేసులో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత అథ్లెట్ లీషా దాస్ 6:58.000 నిమిషాల్లో రేసును పూర్తి చేసినప్పటికీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లాండ్‌కు చెందిన మోర్గాన్ న్యూబెర్రీ కంటే ఆమె 1 నిమిషం 51 సెకన్లు వెనుకబడటంతో ఐదో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియాకు చెందిన ఎరిన్ నార్మోయిల్ (5:24.264), ఇంగ్లాండ్‌కు చెందిన కదీనా కాక్స్ (6:37.119) ప్రదర్శనల నేపథ్యంలో లీషా ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఇదిలా ఉండగా, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులకు బుధవారం చారిత్రాత్మక రోజుగా నిలిచింది. భారత బాక్సర్లు ఏకంగా 10 పతకాలను ఖాయం చేయగా, లాంగ్ జంప్ స్టార్ మురళీ శ్రీశంకర్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో వరుసగా రెండు పతకాలు గెలిచిన తొలి భారత లాంగ్ జంపర్‌గా రికార్డు సృష్టించాడు.

శుక్రవారం,
జూలై 31, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



## మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

**- ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన**




ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

# రామాయణ ట్రైలర్ విడుదల




**- అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి**

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది.

# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్..

**కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిస్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది.చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.**



## విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2



అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగస్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది

## సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు

**- వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక**

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com